గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# మార్చి 2014
# కథలు




నిన్న పొద్దుట కూరలకోసమని మార్కెట్కి వెళ్ళాను, మార్కెట్ పక్కనే అర్పిత వాళ్ళ ఇల్లు, అర్పిత నా చిన్న నాటి స్నేహితురాలు. కలిసి చాలా రోజులు.. ఉహు నెలలే అయ్యింది, ఇంట్లో ఉందో లేదో అని ఒకసారి ఫోన్ చేశా. తను ఇంట్లోనే ఉన్నా రమ్మని చెప్పింది.

అర్పిత ఇంట్లోకి అడుగెడుతుంటేనే ఒక పర్ణశాలలోకి అడుగుపెడుతోన్న అనుభూతి, ఇంటి ముందు మెళికల ముగ్గు, చల్లటి చెట్ల గాలి, తను ఇల్లు సద్దే విధానం చూసి ఇంకా ముచ్చటేస్తుంది. ఇల్లు ఇప్పటికి ఎన్ని సార్లు చూసినా కొత్తగా అనిపిస్తుంది. విశ్మయముతో ఇల్లు చూస్తూ ఉన్నా, ఇంతలో "ఇంక ఇంట్లోకి వస్తావా" అన్న అర్పిత పిలుపుతో ఈ లోకములోకి వచ్చా.

కాసేపు పిచ్చాపాటి కబుర్లు అయ్యాక దసరా నాటి బొమ్మలకొలువు ఫొటోలు చూపించింది. అసలు తినకి అంత ఓపిక ఎక్కడిది, ఇంటి పని, వంట పని, తోట పని, ఇవి సరిపోనట్టు పేయింటింగ్, అల్లికలు, బొమ్మల కొలువుకి బొమ్మల్ని తయ్యారు చేయడం, ఒక గజేంద్రమోహక్షము, గోపికలు కృష్ణుని గట్టాలు తీర్చిదిద్దిన విధానానికి మెచ్చుకోకుండా ఉండలేకపోయా. మెచ్చుకున్నా, పొగిడినా అది ఒక పెద్దపనేనా అని సున్నితంగా తోసిపారేస్తుంది తను.

"దసరా బాగా జరుపుకున్నట్టున్నావే " అని అడిగా...

ఒక చిరునవ్వు నవ్వుతూ... " నవరాత్రులలో అమ్మవారిని రోజుకొక అలంకారము చేసి, పూజ చేశాను. దగ్గరలోనే అమ్మవారి గుడికి తీసుకెళ్ళమని ఆయనతో నవరాత్రులు మొదలవ్వక ముందే చెప్పాను. తీరా నవరాత్రి మొదలయిన రోజే ఇంటికి చుట్టాలు వచ్చారు. మా ఆడపడుచు, పిల్లలు. ఆడపడుచుకి ఈ ఊరిలో ఏదో ఆఫీస్ పని ఉందని పిల్లలతో సహా వచ్చి పిల్లలని నాకు వదిలి తాను ఆఫీస్ పని లో బిజి అయ్యింది. మొదటి రోజంతా ఆడపడుచు పిల్లలతోటే సరిపోయింది. ఇక రెండో రోజూ ఆడపడుచు తరఫు చుట్టాలు ఆవిడని పిల్లల్ని చూడటానికి వచ్చారు. ఆ రోజు వాళ్ళకి వంట, టీలు, టిఫినీలతో సరిపోయింది.

ఇంట్లో పిల్లలు, చుట్టాలు పని తెమలడమే కష్టంగా ఉంటే మూడో రోజు సాయంత్రము శ్రీవారు వీణ కచేరి చేయమని పురమాయింపు, అందరి ముందు అడిగారు ఇంక కాదనలేక ఒక కీర్తన వాయించాను. వచ్చిన వాళ్ళు తెగ ముచ్చట పడిపోయారు. ఇంక మూడో రోజు కూడా అమ్మవారు దర్శనానికి తీసుకెళ్ళలేదు.

ఆ మరునాడు ఆడపడుచు పిల్లలు స్కూల్లో ఇచ్చిన హోం వర్కులు బయటకు తీసి నా దగ్గరకు వచ్చారు. ఇంక ఆ రోజు వాళ్ల చేత హోం వర్కులు చేయించడములో బిజి అయ్యా. వాళ్ళకిచ్చిన ప్రాజెక్టులు చేయించడములో సాయము చేయడముతో సమయం ఎలా గడచిందో తెలియకుండా సాయంత్రము ఏడయ్యిపోయింది, ఈయన సాయంత్రము లేట్ గా రావడంతో ఆ రోజు గుడికి వెళ్ళలేకపోయాము.

ఇలా నవరాత్రులు హడావిడిగా గడచిపోతూ వచ్చాయి. ఇంక నవమి రోజు పిల్లల్ని, చుట్టాలని తయ్యారు చేసి తీరా గుడికి వెళ్దామనుకుంటే మా పనిమనిషి రత్తాలు ఏడుస్తూ మొహనికి రక్తం కారుతూ, చంటి పిల్లని కౌగిలించుకొని రొప్పుతూ, ఏడుస్తూ వచ్చింది. దాని మొగుడు మూడోసారి కూడా దానికి ఆడపిల్ల పుట్టిందని ఆ చంటి పిల్లని ఎవరికో అమ్మడానికి తీసుకెళ్తున్నాడని, అడ్డం వచ్చిన రత్తాలుని కొట్టాడని చెప్పింది. అంతే ఎక్కడ లేని కోపం వచ్చింది. మా కజిన్ పోలీస్ డిపార్ట్మెంట్లో పని చేస్తొన్న వాడిని వెంటనే పిలిపించి... రత్తాలు ని తీసుకొని ఇంటికి వెళ్ళి, రత్తాలిని కొట్టినా, పిల్లలని అమ్మినా పోలీస్ స్టేషన్ లో పెట్టిస్తానని కాస్త గడ్డి పెట్టి వచ్చాము. అసలు ఆడపిల్లంటే అంత అలుసా? అని ఆ రోజంతా మనసు అల్లకల్లోలం అయ్యింది. ఆ గొడవ అయ్యేటప్పటికి రాత్రి 10 అయ్యింది. ఇంక గుడికి వెళ్ళాలి అన్న ఆలోచనే మరచిపోయాము.

ఇంక దసరా రానే వచ్చింది. ఇంటి నిండా జనాలతో పండగ వాతావరణము భలేగా అనిపించింది. సాయంత్రము బొమ్మలకొలువుతో పేరంటాల్లతో చాలా బిజి అయ్యాము. సాయంత్రము ట్రైన్ కి వచ్చిన చుట్టాలందరు ఎవరిల్లకు వారు వెళ్ళిపోయారు. అప్పుడేనా కనీసం గుడికి తీసుకెళ్తారేమో అని ఆయన్ను అడిగితే..

"ఇప్పుడు గుడికి ఎందుకోయ్" అని అడిగారు.

చాలా ఉక్రోషం వచ్చేసింది.

"నవరాత్రులలో ఒక్క రోజు కూడా అమ్మవారిని దర్శించుకోలేదు, ఈ రోజు చివరి రోజు, ఈ రోజు కూడా తీసుకెళ్ళరా?" అని నిలదీసా...

"నువ్వు చూడలేదేమో కాని, నేను మాత్రం రోజు దర్శించుకుంటూనే ఉన్నాగా" అని అన్నారు..

"అంటే నన్ను తీసుకెళ్ళకుండా మీరొక్కరే వెళ్ళొచ్చేశారా?" అని అడిగా...

అందుకు ఆయన చిద్విలాసంగా... "నవరాత్రులలో మొదటి రోజు ఇంటికి చుట్టాలొచ్చినప్పుడు.. వాళ్ళని ఆప్యాయతగా పలకరించి అన్నము పెట్టేటప్పుడు నీలో అన్నపూర్ణాదేవిని చూశాను, పిల్లలతో ఆడుతూ పాడుతూ వాళ్ళల్లో కలిసిపోయినప్పుడు బాల త్రిపుర సుందరిని చూశా, వాళ్లకి చదువు చెప్తోనప్పుడు ఒక గాయత్రిని చూశా, వీణపాణిగా ఉన్న నీలో సరస్వతిని చూశా, కోపం వచ్చినప్పుడు నీలో ఒక దుర్గ, మహిషాసురమర్ధినిని చూశా... ఇంక రోజు సౌందర్యలహరిని చూస్తూనే ఉన్నా..." అంటూ నవ్వారు...

ఈ విషయము చెప్తోన్న అర్పిత కూడా సిగ్గుతో నవ్వింది. ఇలా ఒక పొగడ్త విసిరేసి మొత్తానికి నన్ను నవరాత్రులలో గుడికి మాత్రం తీసుకెళ్ళలేదు ఆయన అని చెప్పింది.

"నిజమే కదా అర్పితా, స్త్రీ ఒక శక్తిస్వరూపిణి... కొందరికి సౌందర్యలహరి, కొందరికి మహిషాసురమర్ధిని " ని అనేసి అలా ఇంటి దారి పట్టాను.

***




అది సాయినగర్ కాలనీ. అందరూ కలసి మెలసి వుంటారు. కాలనీకి ఒకటే అసోషియేషన్ వుండటంతో త్వరగా డవలప్ అయ్యింది. విశాలమైన సిమెంట్ రోడ్డులు. రోడ్డు అందమైన ఇల్లు. ప్రతీ ఇంటిలో చక్కని పూల చెట్లు. రోజ చాలామంది ఆ రోడ్డు మీద వాకింగు చేస్తూ వుంటారు.

ఆ పక్కనే కృష్ణా నగర కాలనీ. కాలనీ లో పట్టుమని వంద ఇళ్ళు లేవు. నాలుగు అసోషియేషన్లు. నలుగురూ నాలుగు పక్కల లాగుతూ వుంటారు. కాలనీ సాయినగర్ కాలనీ కంటే ముందు పుట్టినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుంది. ఇంకా మట్టి రోడ్లు.

సరిగ్గా డ్రైనేజ వసతి రాలేదు.

కృష్ణా నగర్ కాలని లో వుంటున్నారు డెబ్బై ఏళ్ళ రామనాధం. రామనాధం, అతని భార్య జానకి. ఇద్దరికీ దైవ భక్తి ఎక్కువ. రోజూ పూజా పునస్కారాలు చేస్తూ వుంటారు. మూడువందల గజాల స్థలం లో చిన్న ఇల్లు . ఇంటి చుట్టూ దేవుడి పూజ కోసం కోసం పూలమొక్కలు వేసాడు. కాని అదేమిటో గాని ఒక్క చెట్టు సరిగ్గా బతకదు. ఏ చెట్టు పూలు పూయదు.

స్వామినాధం సాయి నగర్ కాలని లో మెయిన్ రోడ్డు లో ఒ చిన్న ఇంట్లో వుంటున్నాడు స్వామి నాధానికి అరవయ్ ఏళ్ళు వుంటాయి. మహా నాస్తికుడు. దేవుడికి దండంకూడా పెట్టడు. ఇంటి చుట్టూ మొక్కలు పెంచాడు. విపరీతంగా పూలు పూస్తాయి. ఆ కాలనీ లో చాలామంది పూలు కోసేవారు కాదు. మర్నాడు వుదయానికి రాలిపడిపోయేవి.

రోజూ వుదయాన్నే రామనాధం, జానకి ఇద్దరూ చేతిలో చిన్న క్యారీ బాగ్ తో వాకింగ్ కి సాయినగర్ కాలనీ వెళుతూ వుంటారు. వాకింగ్ కి వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు రోడ్డు బయట వున్న పూల చెట్లు చూసి ‘ఇదేంటో రోజూ పూజ చేసేవాడి కొంపలో ఎన్ని చెట్లు వేసినా పూలు పూసి చావవు. ఇక్కడ వీళ్ళు దేవుడికి పెట్టడం కాదు కదా చెట్టు నుంచి కూడా కొయ్యరు. అలాంటి వాళ్ళింట్లో కుప్పలు కుప్పలు పూస్తాయి’ అనుకుంటూ ఫీలయి పోయి ఆ చెట్ల నుంచి పూలు తెంపుకుని తీసుకువెళ్లి దేవుడికి పెట్టి పూజ చేస్తూ వుండేవారు.

రోజూ పూలు మాయం అవ్వడం తో స్వామి నాధం ఎవరు కోస్తున్నారా అని ఉదయాన్నే లేచి కాపు కాసాడు.

ఆ రోజ వుదయం పూలు తెంపుతున్న రామనాధం ని చూసి ‘ఎవరండి అది..’ అంటూ బయటికి వచ్చాడు.

పూలు కోస్తున్న రామనాధం స్వామినాధాన్ని చూసి ఆగిపోయాడు.

‘ఏంటి మీరు చేస్తున్న పని’ అడిగాడు స్వామి నాధం.

‘దేవుడికోసం …పూలు…’ అన్నాడు రామనాధం .

‘అడక్కుండా కోసెయ్యడమేనా’

‘అంటే ఎవరూ కొయ్యడం లేదని, రోజు రాలి పడిపోతున్నాయని.’

‘పోతే మీ కేంటి. మేం చెట్లు వేసుకున్నది మీ కోసం కాదు..’

‘నా కోసం కాదండి.. దేవుడి పూజ కోసం.. కోస్తున్నా..’ అన్నాడు రామనాధం.

‘చెట్టుకు అందం కోసం మేం వదిలేస్తున్నాం ... సరే లెండి . కొంచెం కోసుకుని కొన్ని చెట్టుకు వదిలెయ్యండి.’ అంటూ లోపలి వెళ్లాడు.

రామనాధం ఫీలయ్యాడు.

‘అసలు వీళ్ళని కాదు.. ఆ దేవుడిని అనాలి. పూజలు చెయ్యని వాళ్ళింట్లో పూలు విరగబూస్తాయి. రోజూ పూజ చేసే వాళ్ళింట్లో ఒక్క పువ్వు కూడా పూసి చావదు... ఛీ.. రేపటి నుంచి దేవుడికి పూలు లేకుండా పూజ చేస్తా. అప్పుడు గాని దేవుడికి తెలిసి రాదు’ అనుకుంటూ ఆ రోజంతా అదే ఫీలింగులో వున్నాడు. రాత్రి కూడా అదే ఆలోచనలతో పడుకున్నాడు.

***

కాలచక్రం స్పీడుగా తిరిగింది. దానికింద పడి రామనాధం, స్వామినాధం ఇద్దరూ మరణించారు.

***

అది యమ లోకం .

యమధర్మ రాజు సింహాసనం మీద కూర్చుని వున్నాడు.

పక్కన చిత్రగుప్తుడు పాపుల చిట్టా చూస్తున్నాడు.

'పాపులను ప్రవేశ పెట్టండి' అన్నాడు యమధర్మ రాజు.

చిత్రగుప్తుడు ధర్మ ఘంట కొట్టాడు.

యమ భటులు స్వామి నాధాన్ని, రామనాధాన్ని తీసుకు వచ్చారు.

స్వామినాధం, రామనాధం ఇద్దరూ ఒకర్నొకరు చూసుకుని ఆశ్చర్యపోయారు.

చిత్రగుప్తుడు ఇద్దర్నీ చూసి 'ప్రభూ ఇతని పేరు స్వామినాధం. మహా పిసినారి. దేవుడికి ఏనాడు దండం పెట్టలేదు. పరమ నాస్తికుడు' అంటూ స్వామినాధం గురించి చెప్పాడు.

తర్వాత రామనాధాన్ని చూసి 'ప్రభు ఇతని పేరు రామనాధం. మహా భక్తుడు. రోజూ దేవుడికి నైవేద్యం పెట్టి గాని పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టుకునే వాడు కాదు.' అంటూ చిత్రగుప్తుడు యమధర్మ రాజుకి వివరించాడు.

యమధర్మ రాజు ఇద్దరినీ చూసాడు.

'చిత్ర గుప్తా వీళ్ళు చేసిన పాప పుణ్యాలు లెక్క కట్టి పుణ్యం తక్కువయితే ముందుగా స్వర్గానికి పంపించండి. పాపం తక్కువైతే ముందుగా నరకం లో శిక్ష అమలు చేయండి. అన్నాడు యమధర్మ రాజు.

‘అక్కడే ఒక చిన్న సందేహం ప్రభు’

‘ఏమిటది’ అడిగాడు యమ ధర్మరాజు

‘ఈ స్వామి నాధం ఏనాడు పూజా, పునస్కారాలు చేయలేదు. అందుకే అతని ఖాతా లో పుణ్యం లేదు ప్రభు. రామనాధం నిత్య పూజలు చేసేవాడు.అతని ఖాతాలో పుణ్యం వుంది. రామనాధం ఒక్కడే స్వర్గానికి వెళ్ళటానికి అర్హుడు ప్రభూ’ అంటూ విన్నవించాడు చిత్రగుప్తుడు.

అదివిన్న స్వామి నాధం ‘యమధర్మ రాజా దేవుడికి దండం పెట్టక పోవడం. పూజలు చెయ్యకపోవటం కూడా పాపమేనా. అలా అని ఏనాడు దేవుడిని నేను దూషించలేదు. అసలు నేను ఏ పుణ్యమూ చెయ్యలేదా?’ అంటూ అడిగాడు.

యమధర్మ రాజు తన దివ్య దృష్టి తో చూసి ‘చిత్ర గుప్తా… రామనాధం ఖాతాలో వున్న పుణ్యం లో సగం స్వామి నాధం ఖాతాలో వేసి ఇద్దర్నీ ముందుగా స్వర్గానికి పంపించండి.

అది విని రామనాధం ‘ఇది అన్యాయం యమ ధర్మరాజా. నా పుణ్యం లో అతనికి వాటా ఇవ్వడానికి నేను ఒప్పుకోను. నా పుణ్యం అతనికి ఇవ్వడానికి ఆతనేమన్నా నాకు బంధువా, చుట్టమా. అయినా నేను ఎంతో కష్టపడి భక్తి తో ఉపవాసాలు చేసి, పూలతో పూజలు చేసి సంపాదించుకున్న పుణ్యం.’ అన్నాడు.

‘ఎలా సంపాదించావు పుణ్యం మళ్ళీ చెప్పు' అన్నాడు యమధర్మ రాజు.

‘నేను ఎంతో కష్టపడి భక్తి తో ఉపవాసాలు చేసి, పూలతో పూజలు చేసి సంపాదించుకున్న పుణ్యం. ప్రభూ’ అన్నాడు రామనాధం .

‘భక్తిలో ఉపవాసాలు సరే, పూలలతో పూజలు చేసానన్నావు, ఆ పూలు ఎక్కడివి.’ అడిగాడు యమధర్మ రాజు.

రామనాధం ఆలోచనలో పడ్డాడు.

‘‘చెప్పు... నువ్వు పూజ చేసిన పూలు ఎక్కడివి.... అవి..      స్వామి నాధానివి కదా.’

రామనాధం మాట్లాడలేదు.

‘అంటే నువ్వు పూల దొంగగా స్వామి నాధం ఇంట్లో పూలు దొంగిలించి దేవుడికి పూజ చేసావు. మరి ఆ పూజలో పూలు అతనివైనపుడు ని పుణ్యం లో కూడా      అతనికి వాటా వుంటుంది..' అన్నాడు యమధర్మ రాజు.

రామనాధం ఆశ్చర్యపోయాడు.

‘ప్రభు అవి నా కోసం కాదు ఆ దేవుడికోసం చేసాను.’ అన్నాడు రామనాధం.

‘ఎవరికోసం చేసినా దొంగతనం నేరం. మరి ఆదొంగతనం చేసిన పాపం పోవాలి అంటే నువ్వు స్వామి నాధానికి      పుణ్యం పంచాల్సిందే.’ అన్నాడు యమధర్మ రాజు.

‘ప్రభు ఈ పని ఈ రామనాధమే కాదు. భూ లోకంలో చాలామంది చేస్తున్నారు. వారికి వచ్చేది పాపమా పుణ్యమా తెలియక సతమత మవుతున్నా. అన్నాడు చిత్ర గుప్తుడు.

‘చిత్రగుప్తా ఇకమీదట మానవుల పాప పుణ్యాలు లెక్క కట్టునప్పుడు ఇలాంటి పూల దొంగల పుణ్యం లో సగం పుణ్యం పువ్వుల యజమానులకు బదలి చెయ్యండి.’ అన్నాడు యమధర్మ రాజు.

‘అటులనే ప్రభు. మీ ఈ తీర్పుతో నా పని సులభ మయింది’ అన్నాడు.

రామనాధం 'ప్రభూ… నేను పూవులని కోసే సమయంలో ఈ స్వామినాధం నన్ను అడ్డుకున్నాడు.' అన్నాడు .

'అందుకే ని పుణ్యం లో సగమే అతనికి దక్కింది. అతను ఏమీ అనకుండా వుంటే ని పుణ్యం పూర్తిగా అతనికే చెందేది.' అన్నాడు యమధర్మ రాజు.

రామనాధం నోట మాట రాలేదు.

'రామనాధం ఏ దేవుడూ పూలని దొంగిలించి పూజలు చెయ్యమని అడగ లేదు. నీకున్న దానితో ఆ దేవుడిని ఆరాధించు. పూజించు. అప్పుడే నీకు నీ పుణ్యం నీకు పూర్తిగా దక్కుతుంది.' అన్నాడు యమధర్మ రాజు.

రామనాధం 'క్షమించండి యమధర్మ రాజా. ఇంకెప్పుడు పూలు దొంగతనం చెయ్యను. కావాలంటే అడిగి కోసుకుంటాను.. నన్ను క్షమించండి…క్షమించండి.'

అంటూ నిద్రలో అరుస్తున్నాడు.

జానకి 'ఏవండి… ఏవండి… ఏంటి ఏం జరిగింది.' అంటూ తట్టి లేపింది.

ఉలిక్కి పడి లేచాడు రామనాధం.

'ఏంటి ఏమన్నా కల వచ్చిందా.. అలా అరుస్తున్నారు.' అంటూ అడిగింది. జానకి.

'కలా ..అంటే ఇదంతా.. కలా ..' అనుకుంటూ టైం చూసుకున్నాడు.

ఉదయం ఐదున్నర అయ్యింది.

‘అమ్మో తెల్లారగట్ల వచ్చిన కలలు నిజమవుతాయి అంటారు. ఇది నిజమే నేమో.’ అనుకున్నాడు.

జానకి చేతిలో ఒ కవరు తీసుకుని ‘పదండి… వాకింగు కి వెళ్లి పూలు తెచ్చుకుందాం. పూర్తిగా తెల్లవారితే అందరూ లేస్తారు.’ అంటూ తొందర పెట్టింది జానకి.

రామనాధం జానకి చేతిలో కవరు లాక్కుని పారేసి ‘ఈ రోజు నుంచి… వాకింగు… ఓన్లీ వాకింగు. నో పూలు. పద’ అంటూ లేచాడు.

అర్ధం కాక రామనాధాన్ని చూస్తూ నిలబడి పోయింది.

***




దండకారణ్యం లో ఉండే ఒక చిలుకకి మనుషుల మధ్య పెరిగే ఇతర పక్షుల జీవితం ఎలా వుంటుందో తెలుసుకోవాలన్న కోరిక పుట్టింది. అది వెంటనే అక్కడినుండి బయల్దేరింది. సుందరమైన ప్రకృతిని చూసి ఆస్వాదిస్తూ ఎగురుతూ మధ్య మధ్య అలసట తీర్చుకుంటూ మనుషులున్న ఒక ఊరు చేరింది. ఊరు ప్రక్కనే ఒక తోట కనిపిస్తే అక్కడికి వెళ్ళి ఒక జామ చెట్టు మీద వాలింది. చిలుకకి ముందుగా ఆకలి గుర్తొచ్చింది. వెంటనే దోరమగ్గిన జాంపండు ఒకటి ఎంచుకుని తినడం మొదలుపెట్టింది.

సరిగ్గా అప్పుడే అక్కడికి ఒక కోడిపెట్ట వచ్చింది. కోడిపెట్ట చుట్టూ దాని పిల్లలు కూడా ఉన్నాయి. అవి చూడడానికి ముద్దుగా ఉన్నాయి. నేల మీద కనిపించిన పురుగులని, గింజలని కాళ్ళతో కెలుకుతూ తినసాగాయి. అనుకోకుండా చెట్టుమీదకు చూసిన కోడిపెట్టకు కొమ్మ మీద ఉన్న చిలుక కనిపించింది. ఆకుపచ్చ రంగులో శరీరం, ఎర్రని ముక్కు, ఉన్న చిలుక దాని కళ్ళకి అందంగా కనిపించింది. చిలుకను చూడగానే కోడిపెట్టకి అసూయ పుట్టింది. అయితే అది ఎలా తీర్చుకోవాలో తెలియలేదు కోడిపెట్టకి.

నెమ్మదిగా మాటలు కలిపి చిలుక ఎక్కడి నుండి వచ్చిందో తెలుసుకుంది కోడిపెట్ట. తమ మధ్యలో తిరిగేది కాదని తెలియడంతో చిలుకని అవమానించాలనుకుంది. చిలుక వైపు ఎగాదిగా చూసి "నువ్వు ఏదైనా ఆకుపచ్చ ద్రవంలో మునిగి ముక్కుని మాత్రం ఆకుపచ్చ రంగులో ముంచడం మరచిపోయావా? లేకపోతే అందరి చూపులని ఆకట్టుకోవడం కోసమని ముక్కుని ప్రత్యేకంగా ఎర్రని ద్రవం లో ముంచావా? నిన్ను చూస్తుంటే నాటకాల వాళ్ళు రంగులు వేసుకోవడం గుర్తొచ్చి భలే నవ్వు వస్తోంది. నువ్వుకూడ మా ఊళ్ళో నాటకాలు ఆడటానికి వచ్చావా? " అని ఎగతాళిగా అడిగింది.

కోడిపెట్ట వైపు చూడకుండా జామకాయని తినసాగింది చిలుక. తన మాటలకు చిలిక తిరిగి జవాబు చెప్పకపోవడం కోడిపెట్టకి విపరీతమైన కోపం, అవమానం అనిపించింది.

అప్పుడు కోడిపెట్ట మరింత కటువుగా "నిన్ను చూడగానే మనుషులు పట్టుకొని బంధిస్తారు. అక్కడితో ఆగకుండా నిన్ను నానా హింసలు పెట్టి మాటలు నేర్పించి వినోదం పంచమని కష్టాలు పెడతారు. మరికొందరైతే నిన్ను పంజరంలో పెట్టి నీచేత బొమ్మలున్న అట్టముక్కలు తీయించి జోస్యం చెప్పమంటారు. ఇప్పుడు నిన్ను వేటగాడు చూసినా, మన్షులు చూసినా నీపని అంతే...! అబ్బో నీకు ఎన్ని కష్టాలో.. అలాంటి బ్రతుకు ఎవ్వరికీ వద్దు అంది .

అప్పటికీ చిలుక ఎటువంటి జవాబు చెప్పకపోవడంతో కోడిపెట్ట తన గొప్పదనం చెప్పం మొదలుపెట్టింది. దేవుడి దయ వల్ల మాకు అలాంటి బాధల్లేవ్. మా యజమాని తిండిపెట్టి మమ్మల్ని బాగా చూసుకుంటాడు. రాత్రయితే చాలు గంపకింద దాస్తాడు. మేము స్వేచ్చగా ఊరంతా తిరగగలము. కల్లంలో వేసిన చేను కంకులు చెట్ల మీదనుండి పడిన గింజలు ఏరుకుని తింటాము. మేమంటే మనుషులకి ఎంతో ఇష్టం. వాళ్ళ ఇంట్లో కూడా స్వేచ్చగా తిరగమని వదిలేస్తారు. మాకు నచ్చిన ఆహారం తింటాము. నీకైతే అలాంటి అదృష్టం లేదు.. అంటూ గట్టిగా నవ్వింది.

చిలుకకి కోడిపెట్ట మాటలు విని విని బాధ కలిగింది. ఇప్పటికైనా జవాబు చెప్పకపోతే దాని మాటలను కోడిపెట్ట ఆపదని అర్ధమైపోయింది. జాంపండు తినడం పూర్తయిన మూర్ఖులతో మాట్లాట, పోట్లాట మంచిది కాదని మా అమ్మ చెప్పింది. అందుకే ఇంతసేపు జవాబు చెప్పకుండా ఆగాను. కానీ నీతో మాట్లాడకపోతే నీగురించి నువ్వు గొప్పగా ఊహించికుంటున్నావు. అహంకారంతో నువ్వేంటొ మరిచిపోయి మాట్లాడుతున్నావు. ఇంతసేపూ నువ్వు అవివేకంతో మాట్లాడావు. మనుషులు నిన్ను ఎందుకు ప్రేమగా చూసుకుంటారో తెలుసుకోలెని మూర్ఖురాలవు నువ్వు. వాళ్ళకి నీ మాంసం కావాలి. వాళ్ళింట్లో పండగ వచ్చినా, బంధువులొచ్చినా నీ చావు దగ్గర పడినట్టే. నువ్వు బాగా బలిస్తే వాళ్ళకి ఎక్కువ మాంసం వస్తుందని నీకు బాగా తిండి పెడతారు తప్ప, నీమీద ప్రేమతో కాదు. నువ్వు ఎక్కువ పిల్లల్ని కని వాళ్ళకిస్తే వాటితో వ్యాపారం చేసుకుంటారు. లేదంటే కోసుకు తింటారు. అది గుర్తించలేదు నువ్వు. నీది దురదృష్టమైన పుట్టుక. నాది కాదు.

నా గురించి చెప్పేంత గొప్పతనం నీకు లేదు. నేను వినోదం పంచినా, జోస్యం చెప్పినా, నాకుండే గౌరవం ఎప్పటికీ ఉంటుంది. పురాణాల్లో కూడా హంస రాయబారం, చిలుక పలుకులు, కోకిల గానం అని రాసారు కానీ నీ కోడిపెట్టలకి ప్రాధాన్యత లేదు. కవుల

కలాల్లో కూడా నా గురించి వర్ణించేంత గొప్పతనం నాది. మీ యజమాని ఇంటికి చుట్టాలు వచ్చినట్టుంది. అదిగో ఇటే వస్తున్నాడు. నిన్ను చంపడానికేమో జాగ్రత్త... పారిపోయి నీ ప్రాణం కాపాడుకో. " అని జవాబు చెప్పి మళ్ళీ ఎటో ఎగిరిపోయింది.

దాంతో కోడిపెట్టకి గర్వభంగమయింది.




నా స్నేహితుడు జగత్పతిని చూడాలని వాళ్ళింటికి వెళ్ళాను. ఎన్నో రోజులబట్టీ ఒకటే పోను "రా రా రారా" అని. సరేలే కదా ఎటూ శని ఆదివారా వచ్చినాయికదాని వాళ్ళింటికి ఫోన్ చేశా. ఎంతో ఆనందంతో ఇన్నాళ్ళకు మామీద దయ కలిగిందా!, రేపు శనివారం వస్తున్నావుగా? అబ్బా ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి భలే సరదాగా చిన్ననాటి కబుర్లన్నీ తిరగేద్దాం రారా" అంటూ వచ్చేటప్పుడు మీ శ్రీమతిని కూడా తీసుకురారా " అని మరీ మరీ నొక్కి నొక్కి (టెలిఫోన్ ను కాదులెండి, మాటవరస... అంతే) చెప్పాడు మా జగత్పతి. ఎంతో సరదాగా "ప్రొద్దున్నే టిఫిన్ కూడా అక్కడేనోయ్" అంటూ శ్రీమతిని వెంటబెట్టుకుని వెళ్లాను. జగ్గుగాడికి షుమారు ముప్పై సంవత్సరాల వయస్సుంటుంది. నాకన్నా ఒక్క సంవత్సం చిన్న ఐనా ఇద్దరం ఎంతో కలిసి మెలసి ఉండేవాళ్ళం. చదువుకునే రోజుల్లో కలిసి చదువుకోవడంలోగాని, సరదాలలో కానీ ఒక్కటిగా ఉండేవాళ్ళం. ఒకే కంచం ఒకే మంచం లాగా." మరీ ఉదయం టిఫిన్ కూడా అక్కడే ఎందుకండీ వాళ్ళకు కూడా శ్రమ కదా! మీ మగవాళ్ళకేం అలాగే చెపుతారు, ఒక్క

గెస్ట్ వస్తే ఎంతశ్రమో ఆడవాళ్ళకే తెలుస్తుంది." అనిమాఆవిడ అంటున్నా (రోజూ తినే ఇడ్లీలూ, దోసెలేగా, అక్కడైతే మావాడు స్పెషల్ గా మరేదైనా చేయించి ఉండకపోతాడా అనే ఆశ మనస్సులో లేకపోలేదు లెండి, బయటికి చెప్తే మా శ్రీమతి కోప్పడుతుందని) వినిపించుకోకుండా, కారులో బయల్దేరదీశాను.

వాడిచ్చిన అడ్రెస్ ప్రకారం ఇల్లు వెతుక్కుంటూ ఇంటికి వెళ్ళగానే, ఎంతో ఆదరంగా, ఆప్యాయంగా జగ్గు నన్ను కౌగలించుకుని, మా శ్రీమతిని పరిచయం చేయగానే" కులాసానా చెల్లమ్మా?" అంటూ కుశల ప్రశ్నలు వేయడం, కులాసాగా జోక్సు వేయడం మొదలెట్టాడు. మా బాల్యం గురించిన కొన్ని కొంటె సంఘటనలూ వివరించాడు. అందరం ఆనందంగా మాట్లాడుకుంటున్నప్పుడు, ఆత్మారావుడు ఆకలి ఆకలి' అంటూ అరుస్తున్నాడు. పేగుల్లో నుండి శబ్దాలు రాసాగాయి, వాటి బాధ భరించలేక" అరే నేను టిఫిన్ కూడా చేయకుండావచ్చాన్రా! మీ ఆవిడ మీ ఆవిడ సేమ్యా ఉప్మా స్పెషలిష్టని చెప్పింది గుర్తుందిరా!" అంటూ వెంటనే "సేమ్యా ఉప్మా రెండూ" అని కాఫీ హొటల్ సర్వర్ లాగా పెద్దగా అరిచాను. అదిరిపడి ఆవిడ బయటికొచ్చింది.

"చెల్లెమ్మా! నాకు ఆకలి దంచేస్తున్నది. నీవు సేమ్యా ఉప్మా స్పెషలిస్టువని నాకు తెల్సులే! త్వరగా పట్రామ్మా, క్విక్ క్విక్" అంటున్నాను. జగ్గూ గాడు కొంచెం ఇబ్బందిగా ముఖం పెట్టినాడు. కొంచెం టైం పడుతుందనేమో అనుకుని, "ఫర్వాలేదులేరా! లెట్ హర్ టేక్ హర్ ఓన్ టైం" అన్నా. "చెల్లెమ్మ నా మాటలకు "అన్నయ్య గారూ! ఏమనుకోకండి! సేమ్యా ఉప్మా కన్నా, వేరుశెనగ విత్తనాలు, మొలకెత్తినవి తెస్తాను," అంటూ పరుగు పరుగున లోపలికి వెళ్ళి, ఒక ప్లేట్ లో (అది అరలు అరలుగా ఉందిలెండి) పెసర, వేరుశెనగ, బఠానీ, మొలకెత్తిన విత్తనాలు వేరువేరుగా ఉంచినవి తెచ్చి నాముందు పెట్టింది. "అన్నయ్యాగారూ! ఒక నెల నుండీ మాఇంట్లో వంటలు లేవు. ఉదయం మేము మొలకెత్తిన విత్తనాలు ఉపాహారంగా తింటున్నాము." అంటూ, ఇంకా "అసలు అన్నయ్యగారూ! ఈ మొలకెత్తిన విత్తనాలు మోక్ష మార్గానికి నేరుగా దారితీస్తున్నాయంటేనమ్మండీ! ఇందులో ఎన్ని విటమిన్సు ఉంటాయో కదా! దబ్బకాయ రసం తాగితే డాక్టరు తో పనే ఉండదుట! అర్ధగ్లాసు గోధుమ గడ్డిరసం త్రాగుతే ఆసుపత్రితో అవసరమే ఉండదుట! ఆరు అంగుళాల నాలిక కోసం ఆరడుగుల శరీరాన్ని పాడుచేసుకుంటామటండీ!? మొలకెత్తిన విత్తనాలు నోట్లో విసిరేసుకుంటూ ఉపన్యాసం మొదలెట్టింది.

"పూర్వం ఋషులు కేవలం కందమూలాలుతిని కాపురాలు చేయలే దేంటండీ? అసలు భగవంతుడు చేసిన సృష్టిలో ఏదీ వృధాకాదు. ఎండుగడ్డి ఎంతబలం కాకపోతే ఎద్దు అంత పని చేస్తుంది చెప్పండి అన్నయ్యగారూ! అసలు శాఖాహారాలన్నీ సత్వగుణాన్ని పెంచుతాయి కాదుటండీ! ముందు టిఫిన్ కానీండి! నా మాటలు తర్వాత విందురు గాని.." అని ఆమె అనడం గద మాయించినట్లే ఉంది సుమండీ! జగ్గు పాపం మింగలేక కక్కలేక మొహమాటపడుతున్నాడా అనిపించింది. ఇహ మా శ్రీమతి విషయం చెప్పక్కర్లేదనుకుంటా, ఆమె చూపులే నన్ను కాల్చేసేట్లున్నాయి. కమ్మగా ఇంట్లో టిఫిన్ తిననివ్వకుండా తెచ్చానాయె ఏదో గొప్పలన్నీ వదురుకుంటూనూ. ఇప్పుడర్థమయ్యింది. టీవీలో నారాశివారికి, స్నేహితుల ఇంట్లో విందుభోజనం అని ప్రొద్దుట విన్న విషయం నాపట్ల నిజమయింది మరి! కాదనలేక ఆమొలకెత్తిన విత్తనాలు ఇష్టం లేని మందు ఇబ్బందిగా త్రాగుతున్నట్లు, నమలటం మొదలెట్టాం. అసలే మొలకెత్తిన విత్తనాలు! అందులో బఠానీలు కొన్ని బాగా నానినట్లు లేవు, పటపటాని పళ్లకు తగులుతున్నాయి. చడా మడా చివాట్లు పెట్టాలనిపించింది వాడిని. ఐనా సభ్యత సంస్కారం అడ్డువచ్చి, వాళ్ళావిడముందు

వాడ్ని ఎంత ఫ్రెండైనా తిట్టడం బావోలేదని. కోపాన్ని ఆపుకొని, "ఎలా ఉన్నాయి అన్నయ్యగారూ మొలకెత్తిన విత్తనాలు" అని అడుగుత్త ఆమెతో "ఆహా! చాలా బావున్నాయమ్మా!" అంటూ అనలేక తినలేక అన్నాను. ఇంకే ముందీ ఉపన్యాసం తరువాయి బాగం అన్నట్లుగా ఊపందుకుంది.

"నిజానికి అన్నయ్యగారూ! మాఇంట్లో ఇప్పుడు గ్యాస్ పొయ్యి వెలిగించేది లేదు, ప్రెషర్ కుక్కర్ వాడకం లేదు, మిక్సీకి విశ్రాంతే! గ్రైండర్ గైర్ హాజరే! అసలు వంటే లేదు , వంటింటి వాడకమే లేదనుకోండి! ఎంత పొదుపు! ఎంత విశ్రాంతి! ఎంత విరామం?" అన్నది విజయ వంతమైన ఫేస్ పెట్టి, విశాలమైన కళ్ళు మరికాస్త విశాలం చేసి త్రిప్పుతూనూ. నేను ఉండబట్టలేక "మరి కాఫీ టీ లాంటివిలేవా?" అన్నాను. (కనీసం ఆవేన్నిళ్ళైనా కాస్త కడుపులో పడతాయేమోననే ఆశతో) "ఆ అవసరమేంటి అన్నయ్యగారూ! పదకొండింటికి గోధుమగడ్డి రసం, గోంగూరాకులు కొన్ని తీసుకుంటాం." అన్నది ఠకీమని. "ఐతే మధ్యాహ్న భోజనం?" అని పాత్రికేయుడిఫోజుపెట్టి అడిగాను." అసలు ఆకలైతేగా అన్నయ్యగారూ! రెండు గంటలకు పచ్చిదోస, కీరాదోసకాయముక్కలూ, రెండు నిమ్మకాయ చెక్కలూ, నారింజకాయ తొక్కలూ ముక్కలుగా కోసి మేము హాయిగా తింటాము. అంతే మా లంచ్! చూస్తారుగా ఈరోజు మ్మీరూనూ! ఎంత హాయిగా నిద్రపడుతుందోగా! ఆయన ఆఫీసులో కూడా యివే తింటారు. సాయంత్రం స్నాగ్గా కూడా ఇవే తీసుకుంటారు. రాత్రి తొమ్మిదిగంటలకి పడుకుంటే మళ్ళీ ఐదుగంటలకే లేవటం." అన్నది. మరి రాత్రి డిన్నర్!" అన్నా గాభరాగా.

"ఏక భక్తం సదారోగ్యం" కదా అన్నయ్యగారూ! మేం ఏక భుక్తమే నో డిన్నర్." అంది మహదానందంగా, ఒక పెద్ద యోగిని పోజ్ పెట్టి, హతవిధీ అనిలోపల అనుకుంటూ "మరి ఉదయాన్నే లేచి..." అని మధ్యలోనే ఆపేశా ఏంవినవలసి వస్తుందోని. "లేవగానే ఆసనాలు వేస్తాం. యోగా చేస్తాం, చలికాలమైనా చన్నీటి స్నానం చేస్తాం. ఇంక ఉదయం మీకు ఇందాక చెప్పానుగా!" అంటూ కొంత బ్రేకు తీసుకున్నది. ఇంతలో నేనూ మా శ్రీమతీ, విత్తనాల ఉపాహారాన్ని (కడుపులోని అగ్నికి ఏదో ఒకటి వేయాలి గనుక) పూర్తిచేసి ఇలాగోలా కూర్చున్నాం. (దిగాలుగా) "రండి లోపలికి! మా కిచెన్ చూద్దురుగాని, అంతా మోడల్ హౌస్ అని మెచ్చుకుంటారులెండి" అంటూ కిచెన్ లోకి దారితీసింది. ఫ్రిజ్ తెరిచింది. ఏమైనా కూల్ డ్రింకైనా ఇస్తుందేమోనని ఆశగా ఎదురుచూశా." కూరగాయల రసం. ఇంధ తీసుకోండి" అంటూ ఇద్దరికీ చెరో అరకప్పు ఇచ్చింది. కాకరకాయ రసం! అవిపాళ్ళు ఎక్కువైనాయేమో! ఓరినాయనా! గరళం త్రాగిన శివునిలాగా ఉన్న నా మొహం చూసింది మా శ్రీమతి! (లోలోపల నవ్వుకుంటున్నదేమోని నాఅనుమానం, నా పరిస్థితికి) కాని ఆమె అవిత్రాగడానికి వేసిన బిక్కమొహం చూసి నాకు బాధేసింది. అత్తగారింటికి అప్పుడే వచ్చిన కొత్తకోడలిలాగా "ఏమనుకోకండి. నాకు మా ఫ్రెండ్స్ తో 'మోకాళ్ళ నెప్పులూ పోటానికి మొలకెత్తిన విత్తనాలు' అనే శీర్షిక మీద ఉపన్యాసం ఉంది. మళ్ళీ ఒక్క గంటలో వస్తాను. మధ్యాహ్నం కూడా మా ఇంట్లోనే ఆతిధ్యం స్వీకరించాలి తప్పదు. రాక రాక వచ్చారాయె!" అంటూ చకచకా వెళ్ళిపోయింది జోల్లేసుకుని.

"నా తల్లే! మధ్యాహ్నం కూడానా?" అంటూ మా ఆవిడ లోపల అనుకోడం నాకు వినిపించిందిలెండి.

ఇంతలో పాపం జగ్గూ 'గిల్టీ కన్షస్ తో "ఏరా! ఏమనుకోకురా! ఈమధ్యా మా ఆవిడతో చస్తున్నానురా! మాట్లాడితే మొలకెత్తిన విత్తనాలూ, గోధుమగడ్డి రసం అంటుంది రా! నాకు జిహ్వా చాపల్య కొంచెం ఎక్కువని నీకు తెల్సుకదా? ఇడ్లీ చేయమంటే ఇగురాకుల రసం తాగమంటుంది, పకోడీ తినాలని ఉందంటే పనసపొట్టురసం యిస్తుంది. దీని నేచురోపతి' కాదు కానీ నాకొంపతీస్తున్నదిరా శ్రీపతీ! జీవితం మీద కోరికపోతున్నది. నోరు చవిచెడిపోతున్నది. నేను ఇంకెవరితో చెప్పుకుంటానురా! భగవంతుడు నాలిక లేకుండా నన్నా నన్ను పుట్టించి ఉంటే బావుండేది రా! కమ్మని భోజనం చేసి ఎన్నాళ్ళయిందోరా! ముద్దపప్పు టేస్టులో, ములక్కాడ పులుసులో ఎనక ఉన్న వాసన ఎందరికీ తెలుసులే!" అని పాడాడు దిగులుగా ముఖం పెట్టి విషన్నవదనం తుడుచుకుంటూ. (ముద్దబంతి పూవులో మూగకళ్ళ ఊసులో మాదిరిగా) నాకు వాడిబాధ చూసి, కళ్ళనీళ్ళ పర్యంతమైంది. "ఒరే నాయనా! నీకెంత కష్టమొచ్చిందిరా! చిట్టి తండ్రీ జగ్గూ నాయనా!" అనుకున్నా. "ఒరేయ్! నీవేమీ అనుకోకురా! తల్లీ నా సోదరీ! సిగ్గువిడచి అడుగుతున్నాను. రెండ్రోజుల్లో నా భార్య పుట్టింటికెలుతున్నది. అక్కడా వాళ్ళ అమ్మ నాన్నలకు ఈ నాచురోపతి చెప్తుందిట, వారి ఖర్మ కాలుతున్నది! పాపం ఆముసలి దంపతులను తల్చుకుంటే దిగులేస్తున్నది. శని దేవుడైనా కొన్నాళ్ళుపట్టిపోతాడు, నాకు మా ఆవిడా, నా అత్తామామలకు వారి కూతురూ వదిలేది లేదుగా! అమ్మా! నన్ను మీ ఇంటికి భోజనానికి పిలవండి! మీకెంతో ఋణపడి ఉంటాను. కాస్త రుచులు చచ్చిపోకుండా నాలుకను తడుపుకుంటాను." అని మా జగ్గూ బ్రతిమలాడుతుంటే నాకు నవ్వాగిందికాదు.

***




"మేడమ్, ఇవాళ సాయంత్రం ఆరున్నరకి మధురానగర్ ఓల్డ్ ఏజ్ హోం లో నా కథాసంకలనం ఆవిష్కరణ సభ జరుగుతుంది. తప్పక రావాలి" అన్నాను ఇన్విటేషన్ ప్రిన్సిపాల్ రాధాదేవి చేతిలో ఉంచుతూ, "ఓ, వెరీ గుడ్!, కంగ్రాట్స్ దివ్యా, ఇంతకీ ఎవరు రిలీజ్ చేస్తున్నారు?" ఆసక్తిగా అడిగారావిడ. "వృద్ధాశ్రమం సీనియర్ మెంబర్ ఒక రిటైర్డ్ ప్రొఫెసర్ చేస్తున్నారు మేడమ్" అన్నాను ఉత్సాహంగా.

"ఓ, నో... లోకల్ ఎం.పి. నో, కనీసం మేయర్ నో, కమీషనర్ నో పిలిస్తే ఎంత బాగుండేది.? అది కూడా వృద్ధాశ్రమంలో కాకుండా ఏహోటల్లోనో ఫంక్షన్ పెడితే ఎంత గ్రాండ్ గా ఉండేది. ముందు ముందు మన కాలేజికి ఎంత పబ్లిసిటీ... ఎంత పాపులార్టీ. ఒక్కమాట ముందుగా చెప్తే నేను చూసుకునే దాన్నిగా!" కించిత్తు కినుకగా అంటూ "ఓకే, ఆల్ ద బెస్ట్, వీలయితే వస్తా" అందామె కార్డు సొరుగులో పడేస్తూ. నాకు మనస్సు చివుక్కు మన్పించింది.

నా ఉద్దేశాలు, ఆదర్శాలు వీళ్ళకి తెలియవు. సామాజిక స్పృహతో నిండిన రచనలు చేయడమే కాకుండా, సమాజానికి, వృద్ధులకి

ఏదో చేయాలనే తపన నాలో మెండు. ప్రతిదానిలో స్వలాభాన్ని, స్వార్థాన్ని మేలవిస్తూ లెక్కలు కట్టడం నాకు అసలు ఇష్టంలేదు. నన్నెందుకు అర్థం చేసుకోరు వీళ్ళు?... పెదవి నములుతూ ఆలోచిస్తూ మెయిన్ స్టాఫ్ రూంలో అడుగుపెట్టాను. "హాయ్ దివ్యా! కంగ్రాట్స్, నీ కథాసంకలనం ఇవాళేగా ఆవిష్కరణ, పేపర్లో చూసాను, పార్టీ ఏది?" కామర్స్ లెక్చరర్ సీమ నవ్వుతూ పలకరించింది. "తప్పకుండా, సాయంత్రం ఫంక్షన్ కి వస్తావుగా" అన్నా ఇన్విటేషన్ ఇస్తూ. "అబ్బా ఈఫంక్షన్స్ కి, నాకూ బహుదూరం నీకు తెలుసుగా, సాయంత్రం, మాఆయన, అత్తగారి సేవలు, ఎక్కడికీ రాలేను... హవుస్ అరెస్ట్" అనేసింది. దగ్గరే ఉన్న ఇద్దరు, ముగ్గురు లెక్చరర్స్ ఆహ్వానపత్రికలు అందుకుని "ట్రైచేస్తాం మేడమ్" అన్నారు.

సెకండవర్ క్లాసయి వస్తోంటే దారిలో మెట్ల దగ్గర కలిసారు పావని, రుక్మిణి లాంగ్వేజ్ లెక్చరర్స్. 'హాయ్' చెప్పి ఫంక్షన్ కి ఆహ్వానించాను. "మధురానగర్ వృద్ధాశ్రమం అంటే శారీమేలా పెట్టారు. అక్కడేనా?" అడిగింది పావని. "వావ్! అదేనే, ఆమధ్య మనవాళ్ళంతా భలే భలే చీరలు కొనుక్కున్నారు. ఇవాళే లాస్టట. మనమూ వెళదాం. మా అన్నయ్య వెయ్యి రూపాయలు పంపాడుగా" అంది తొందర చేస్తున్నట్లు. "ష్యూర్" అని నా వైపు తిరిగి "టైంకి గుర్తు చేసావు దివ్యా, నీఫంక్షన్ చూస్కొని షాపింగ్ చేస్తాం, ఇంతకీ డిన్నర్ ఉందా?" అడిగింది ఆశగా. వాళ్ళ మనస్తత్వం అర్థమైపోయింది నాకు. "హోంలో సభ పెట్టాం కదా వాళ్ళే స్నాక్స్, టీ అరేంజ్ చేస్తున్నారు సాయంత్రం!" నవ్వుతూ చెప్పేసి ముందుకు నడిచాను. "మరి వాళ్ళు స్నాక్స్ ఇస్తే నువ్వు డిన్నర్ ఇవ్వచ్చు కదోయ్!" అంటూ వెనక నుంచి ఇద్దరు ఏదో జోక్స్ వేసుకుని నవ్వడం విన్పించింది.

నా రూంలో ఫ్యాన్ వేసుకొని కూచుని ఆలోచనల్లో పడ్డాను. సాయంత్రం ఫంక్షన్లో ఏం మాట్లాడాలో, పుస్తకాలు ఎవరెవరికి ఇవ్వాలో ఆలోచిస్తూ ఒక ఇన్విటేషన్ కాలేజ్ నోటీస్ బోర్డులో పెట్టాలని లేవబోతుంటే, రాజులమ్మ గదిలోకి నీళ్ళు పట్టుకొని వచ్చింది. "దన్నాలమ్మ టిఫిను సేసినారేటి, క్లాసుకి వెల్తున్నారుగావల్న" అంది. "అవును గాని ఈపేపరు కాస్త నోటీసు బోర్డులో పెట్టివస్తావా?" అన్నాను అందిస్తూ. "ఏటమ్మా ఇది?" కుతూహలంగా అడిగింది. "సాయంత్రం నేను వ్రాసిన కథల పుస్తకం గురించి సభ ఏర్పాటు చేస్తున్నారు మదురానగరంలో... దానికి సంబంధించింది" అన్నా నవ్వుతూ.

"ఓలమ్మో! నువ్వు పాఠాలు సెప్పడమే కాకుండా, కథలు కూడా రాస్తావేటి, ఇంతకీ నేను మదురానగరు కాన్నించేగా వచ్చేది, ఎక్కడమ్మా సబ జరిగేది?" అడిగింది మరికాస్త ఆసక్తిగా. "అదే అక్కడో వృద్ధాశ్రమం ఉందిగా అక్కడే. ఇక నువ్వు వెళ్తావా నేను వెళ్ళి పెట్టుకోనా?" అడిగి విసుగ్గా "ఇదిగో సిటికెలో ఎల్తా" అని తుర్రుమని వెళ్ళిపోయింది.

రాజులమ్మ మా కాలేజీలో స్వీపరు. దాని మొగుడు ఆటో వేస్తాడు, ముగ్గురు పిల్లలు. కష్టపడి పని చేస్తుంది. కాలేజీ పని కాకుండా ఉదయం, సాయంత్రం పాచిపన్లు కూడా చేస్తుంది, మేమేం చెప్పినా వినుకోకుండా ఒళ్ళుదాచుకోకుండా పని చేస్తుంది. నేను అప్పుడప్పుడు ఏదైనా పాతబట్టలు ఇస్తూ ఉంటాను. మంచిపనిమంతురాలు, అప్పుడప్పుడు నాదగ్గర కొచ్చి చదువు నేర్పమని అడుగుతూ ఉంటుంది. ఇన్నాళ్ళకి సంతకం మాత్రం నేర్చుకుంది.

లంచవర్లో మా చిన్నాన్న గారి కొడుకు నాకు అన్న అవుతాడు, వాడికి ఫోన్ చేసి పిలిచాను. "ఓహో రచయిత్రి అన్నమాట! ఇంతకీ పబ్లిషర్ ఎవరు? ఎన్ని కాపీలు వేయించావు? రాయల్టీ ఎంతేంటి?" అన్ని ఆరాలు అడిగి "ఫ్రెండ్ పెళ్ళి వుంది రాలేను" అని చెప్పేసాడు. సీనియర్ మేడమ్స్ కొందరు మనస్ఫూర్తిగా అభినందించి 'మేము రాలేకపోయినా, వచ్చినట్లుగా భావించమని, మరోలా అనుకోవద్దని' చెప్పారు. ఎవర్ని పిలిచినా ఏదో ఒక వంక చెప్తూనే ఉన్నారు. చుట్టాలు వస్తున్నారనో, ఒంటరిగా రాలేమనో, పిల్లలకి హోం వర్క్ చేయించాలనో కొందరయితే 'ఏం పార్టీ ఇస్తావు! 'స్వీట్స్ తేలేదే!' సాయంత్రం ఏ చీర కట్టుకుంటావ్?' 'పుస్తకాలమ్మిన డబ్బుతో ఏం కొంటావ్?' ఇలాంటి చచ్చు ప్రశ్నలే కాని ఒక్కరు కూడా పుస్తకంలో ఎన్ని కథలు రాసావని గాని, ఎంత కష్టపడి రాసుంటావో అని గాని, పుస్తక రూపం రావడానికి ఎంత ప్రయాస పడివుంటావో అనిగాని మాట వరసకి కూడా అనలేదు.

ఎవరొచ్చినా రాకపోయినా ఏదీ ఆగదు కదా! అనుకున్న ప్రకారం వృద్ధాశ్రమంలో విశ్రాంతాచార్యుల చేతుల మీదుగా పుస్తకావిష్కరణ జరిగింది. నేను అనుకున్న వాళ్ళు గాని, నా సర్కిల్ వాళ్ళుగాని ఎవరు రాకపోయినా సాహిత్యాభిమానులు, నా శ్రేయోభిలాషులు కొందరు, పేపరు చూసి కొందరు రావడం నాకెంతో ఆనందాన్ని కల్గించింది. హాల్ దాదాపు నిండింది. వృద్ధాశ్రమంలో ఇలాంటి ఫంక్షన్ జరగడం ఇదే ప్రధమమంట. పుస్తకం ధరలో సగానికి విక్రయించి ఆసొమ్ము వృద్ధాశ్రమానికి బహుమతిగా ఇవ్వాలని నేను మాఆయన అప్పటికప్పుడు నిర్ణయం తీస్కున్నాము. వెంటనే సెక్రటరీ అనౌన్స్ చేసారు ఆ విషయాన్ని.

"దివ్య, దినేష్ దంపతులు ఆవిష్కరణానంతరం కథా సంకలనాలని కొనుక్కున్నవారికి డిస్కౌంట్ ఇవ్వడమే కాకుండా ఆసొమ్ముని మన ఆశ్రమానికి డొనేట్ చేయదల్చినందున అందరు కొనుక్కోవాల్సిందిగా అభ్యర్ధిస్తున్నాము" అని. మొట్ట మొదలు కొనుగోలు చేయడానికి వచ్చిన వ్యక్తిని చూసి తెల్లబోయాను, ఎవరో కాదు రాజులమ్మ. యాభై రూపాయలు తీసి సెక్రటరీ చేతిలో పెట్టి పుస్తకం అందుకుంది. ఒకళ్ళని చూసి ఒకళ్ళు దాదాపు పది, పన్నెండు మంది దాకా పుస్తకం కొనుక్కున్నారు. చెప్పినట్లుగా ఆసొమ్ము వృద్ధాశ్రమానికి అందజేశాము. చివరగా నాకూ, శ్రీవారికి ఆశ్రమం వాళ్ళు సన్మానం చేసి, ఆశీర్వదించారు. మంచిపని చేస్తున్నందుకు అభినందించారు.

మర్నాడు కాలేజికి వెళ్ళగానే అంతా పలకరించారు - 'ఫంక్షన్ బాగా జరిగిందా?' రాలేకపోయాం ఏమనుకోకు', 'చుట్టాలు వచ్చారు', 'ఒంట్లో బాగోలేదు' అంటూ ఏవో కారణాలు చెప్పారు. ముందు ఊహించినదే కాబట్టి పెద్దగా నేను రియాక్టవలేదు. నా ఫ్రెండ్ రాగిణి మాత్రం సిన్సియర్ గా బాధపడింది. ఊరికి దూరంగా కోలనీలో ఉంటున్నారు వాళ్ళు. భర్త ఆఫీస్ నుంచి వచ్చేసరికి లేటయిపోయిందట. రావాలని ఉన్నా కుదరాలిగా. నేను ఓదార్పుగా చెప్పాను. "మనకి రావాలనే కోరిక ఉన్నా అవకాశం ఉండాలి, అవకాశం ఉన్నా ఆటంకం ఎదురవకుండా ఉండాలి. నీకు రావాలని ఉంది, మీ ఆయన త్వరగా ఆఫీస్ నుంచి వచ్చేసి అవకాశం కల్పించినా, బైలుదేరే వేళకి ఎవరో ఒకళ్ళు రావడమో, లేక ఇంకేదో అవరోధం వస్తే నువ్వేం చేయగలవు? అందుకని ఆసక్తి, అవకాశం, అవరోధం ఈ మూడు ముడిపడి వుంటాయి. తెల్సుకో! అవకాశం ఉండి. అవరోధాలు లేకపోయినా కొంతమందికి ఆసక్తి ఉండకపోవచ్చు. వాళ్ళ ఇంట్రస్టులు వేరుగా ఉండచ్చు. కాబట్టి రాగిణీ నువ్వేం ఫీలవకు నెక్స్ట్ టైం బెటర్ లక్!" అని రూంలోకి

వచ్చాను.

రాజులమ్మ నవ్వుకుంటూ నాటేబుల్ తుడుస్తోంది. "హాయ్ రాజులమ్మా, చాలా థాంక్స్, పిలిచిన వాళ్ళు రాకపోయినా పిలవకపోయినా నువ్వు నా ఫంక్షన్ కి రావడమే కాకుండా పుస్తకం కూడా కొన్నావు. అయినా నీకు రావాలని ఎలా అన్పించింది?" ఆసక్తిగా అడిగాను. "ఏటమ్మా, మరీ సెప్తారు? ఇంతపెద్ద కాలేజీలో అందరేసి పిల్లలకి బలేపాటాలు సెప్పే టీచరమ్మవి! ఏ ఫంక్షన్ అయినా టేజి మీద సక్కగా ఉపన్యాసాలు ఇచ్చేత్తావు, పిల్లలతో శానా సరదాగా, నవ్వుతూ మాట్టాడతావు, టీచరమ్మలతోనే కాకుండా మాలాటి పనోళ్ళని కూడా పేరుతో పలకరించి కట్టం సుకం మాట్టాడతావు, అలాటిది నీ పుస్తకం సబ అవుతుంటే రాకుండా ఎట్టా ఉంటాను?"

"అదికాదు, నీకు పన్లు వుంటాయిగా సాయంత్రం...?" "ఆ.. పన్లు, పిచ్చిపన్లు రోజూ ఉండేయేగా, మాఅత్తకి గుంటల పని అప్పసెప్పి వచ్చినా. ఓలమ్మో పెద్దోల్లంతా నీ పుస్తకం గురించి ఎంత బాగా మాట్టాడారమ్మా! నువ్వు సరేలే ఎప్పుడు బానే మాట్టాడతావుగా! అందుకే ముందు నేనే కొనాలా అని పుస్తకం కొనేసినా" అంది నవ్వుతూ. "నీకు చదువు రాదుగా ఏంచేస్తావా పుస్తకాన్ని?" అడిగాను ఉత్సుకత నిండిన గొంతుతో, "ఏటీ, సదువు రాదా? ఎంత మాట అనేసినావు తల్లో? నానుండేది ఎక్కడ?... ఇస్కూల్లోనేనా! ఇంటికాడ నాగుంటలు సదూకుంటున్నారా నేదా! ఎవర్నడిగితే సదివి పెట్టరు. సెప్పు? కాళీటయంలో ఒక్క కత సదివి సెప్పమంటే సెప్పరా అమాత్తరం! ఇంత పుస్తకం నువ్వు కట్టపడి రాయగానేంది, నానామాత్తరం యాబయి రూపాయిలెట్టి కొనుక్కొని సదివించుకోలేనా? ఏటో పిచ్చితల్లి. ఇన్ని సదువులు సదివావు, ఈమాత్తరం తెలిదా?" అని నవ్వుకుంటూ చీపురు తీసుకుని వెళ్ళిపోయింది రాజులమ్మ.

ఎంత ఆశ్చర్యం? పెద్దచదువులు చదివి, పెద్దవుద్యోగాలు వెలగ పెడుతూ కూడా తోటి ఉద్యోగినిని అభినందించడానికి ఆమడదూరం పారిపోతుంటే ఏమీ చదువుకోని ఒక చిరుద్యోగి చదువు పట్ల ఎంత మన్నన కనబరుస్తోందో చూస్తుంటే రాజులమ్మ వ్యక్తిత్వం ముందు నాకు అందరూ మరుగుజ్జుల్లాగా తోచారు. కన్పించని సత్యమేదో కళ్ళముందు ఆవిష్కరించబడుతుంటే కిటికీలోంచి దూరంగా రాజులమ్మ కన్పించింది అక్షరం విలువ తెలియచెప్తున్న అపర సరస్వతిలా!

***




బాస్కర్ కాలనీలో వడి వడిగా నడచుకుంటూ తను అనుకున్న ఇంటి ముందుకి రాగానే మిస్టర్ ధన్ కళ్ళు మెరిశాయి. గేటు తీసుకుని లోపలికెళ్ళి నెమ్మదిగా మెట్లమీదుగా నడుచుకుంటూ పైనున్న ఒక వాటా ముందాగి గట్టిగా ఊపిరి పీల్చుకుని ద్వారానికున్న కర్టెన్ తొలగించాడు. తాళం కనిపించింది వెక్కిరిస్తూ..

‘షిట్..మళ్ళీ తప్పించుకున్నారు" మనసులో అనుకుని ‘లాభంలేదు ఈసారి పకడ్బందీగా స్కెచ్ వేసి పట్టుకుంటాను. అప్పుడు..నా సామిరంగా..’ కోపంగా అనుకుని వేగంగా అడుగులేస్తూ వెళ్ళిపోయాడు.

***

"ఇందులో ఎవరు?" అడిగాడు శివ. ఏదో ఫంక్షన్‌లో తీసిన ఫోటో అది. కొద్దిగా పాతబడింది.

"నువ్వు గుర్తు పట్టడానికి అనువుగా పెన్‌తో గుండ్రంగా ఫేస్ చుట్టూ మార్క్ చేశాను కదా" విసుగు ధ్వనించింది మిస్టర్ ధన్ గొంతులో.

"నేనేం చేయాలి?"

"వాళ్ళ ప్రతి కదలికనీ జాగ్రత్తగా గమనించి నాకు తెలియజేయాలి.. మరీ ముఖ్యంగా వాళ్ళెక్కడ ఒంటరిగా దొరుకుతారో.." అన్నాడు కర్కశంగా.

"వారంరోజులు కావాలి నాకు.. ఒకేనా?"

"ఓకే!"

"మరి.." చెయ్యిజాపి నర్మగర్భంగా డబ్బు అడిగాడు.

"నాకు ఎంతొచ్చినా..నీకు మాత్రం ఫిఫ్టీ"

"తక్కువవుతుంది"

"అసలు ఈపనికి మా వాళ్ళు చాలు. కాని దీని వెనుక నేనున్నానని వాళ్ళకి తెలియకూడదు. మావాళ్ళైతే గుర్తుపట్టే చాన్సుంది"

"సరే డీల్ నాకోకే" సంతోషంగా అని ఈలేసుకుంటూ బయటకెళ్ళిపోయాడు శివ.

***

"ఇదిగో వాళ్ళ ప్రతి కదలికా వివరంగా రాసి ఈ నోట్ బుక్‌లో ఎంటర్ చేశాను. ఎక్కడా ఏదీ మిస్ చేయలేదు. పని పూర్తయింది. మరి.." చెయ్యి చాపుతూ అడిగాడు.

"ముందు నాకు రానీ ఆ వెంటనే నీకిస్తా. నా మాట అంటే నీకు తెలుసుగా"

తెలుసన్నట్టుగా అక్కడినుండి నిష్క్రమించాడు.

***

ఆ బుక్‌లో వున్నట్టుగా వాళ్ళిద్దరూ ఇప్పుడు ఈ నిర్మానుష్య ప్రదేశంనుండే వెళ్ళాలి. అందుకే మిస్టర్ ధన్ పెద్ద మర్రిమాను చాటుగా నిలబడ్డాడు. 'ఈ రోజు వాళ్ళు దొరికిపోవడం ఖాయం..' మనసులో అనుకున్నాక అప్రయత్నంగా వంకర నవ్వు మిస్టర్ ధన్ పెదాలపై నిలిచింది.

దూరంనుండి వాళ్ళు వస్తున్నారు. వ..స్తు..న్నా..రు.

'తనని హఠాత్తుగా చూస్తే వాళ్ళెలా ఫీలవుతారో.. దెబ్బకి గుండాగిపోతుందేమో.. అలా మాత్రం జరగకూడదు.. తనకి లాస్' వాళ్ళు కాస్త దగ్గరగా రాగానే ఒక్కసారిగా వాళ్ళముందు దూకాడు మిస్టర్ ధన్.

భయంతో వాళ్ళ గుండెలు గుబ గుబ లాడాయి. కళ్ళు తేలేశారు.

"నేను మిమ్మల్ని పట్టుకోలేననుకున్నారు..అందుకే ఇలాంటి నిర్మానుష్య దారినెంచుకున్నారు కదూ.. అదే నాకు ప్లస్సయింది." అన్నాడు వాళ్ళిద్దరి వంకా సూటిగా చూస్తూ.

వాళ్ళనోటినుండి ఒక్క మాటా లేదు. హై వోల్టేజి షాక్ గొట్టినట్టుగా వున్నారు.

ఇహ లాభంలేదని నోరు విప్పాడు మిస్టర్ ధన్ "ఒరే నాయనలారా! మీ మాటలు విని మీరేదో మంచి వారని నమ్మి బ్యాచిలర్సయినా.. నిరుద్యోగులైనా.. మీకు నా ఇల్లు అద్దెకిచ్చాను.. నేనా పటన్ చెరువులో వుంటాను.. ఇల్లా దిల్‌షుక్‌నగర్లో వుంది. దూరా భారాలకి జడిసి రాలేకపోతుంటే.. రెంట్ ఇవ్వకుండా నన్నే డిపిస్తార్రా? ఆర్నెళ్ళయింది.. ఒక్క పైసా కూడా అద్దెకట్టలేదు. తాతలనుండీ సంక్రమించిన ఇల్లురా అది.. ఏదో నా జీతానికి తోడు..ఇంటి అద్దెలో ఈ కరువురోజుల్లో గుంభనంగా సంసారాన్నీడుద్దామంటే.. మీరెక్కడ దాపురించార్రా నా ప్రాణానికి?" ఘొల్లుమన్నాడు.

"ఒరే! మూర్తీ మనకి ఉద్యోగం ఎందుకు రావడంలేదో ఇప్పుడు అర్థమయిందిరా.. ఈయన ఏడ్పు గొట్టి.. అందుచేత నిన్న నీకు ఇంటి దగ్గరనుండి ఎం ఓ వచ్చిందిగా ఓ రెండు నెలల అద్దె ఆయనకివ్వు..నా కెందుకో మనకి మంచి జరుగుతుందనిపిస్తోంది"

"నిజమేరా రాఘవా.. ఇదిగోండి.. సారీ మిమ్మల్ని అనవసరంగా ఇబ్బంది పెట్టాము. మీరు మంచి మనసుతో ఆశీర్వదిస్తే.. మాకు ఉద్యోగమొస్తే అద్దెడబ్బు పెంచి మరీ ఇస్తాం"

"మీరు నిజంగా మంచివాళ్ళే.. శీఘ్రమే ఉద్యోగ ప్రాప్తిరస్తూ" అని దీవించి ఇంటిదారి పట్టాడు మిస్టర్ ధన్ అదే మిస్టర్ విశ్వనాధన్.

"మరి.." ఎదురుగా వచ్చి చేతులు చాచాడు శివ.

"ఓరి..నేను వాళ్ళని ఫాలో అవుతుంటే నువ్వు డబ్బుకోసం నన్ను ఫాలో అవుతున్నావా? ఇదిగో" అని ఓ యాభై రూపాయలు చేతిలో పెట్టాడు.

అది తీసుకుని ఈలేసుకుంటూ వెళ్ళిపోయాడు శివ.

***




"ఇక్కడ కూర్చోవచ్చమ్మా..." అన్న మాటలకు పుస్తకంలోనుండి తలెత్తి "భలేవారే ఇదొక్కటే నా సీటు మీరు నిరభ్యంతరంగా కూర్చోవచ్చు అహల్య అన్నది. ఆ పెద్దావిడ చాలా నిస్త్రాణంగా సీటుకు ఒరిగిపోయి కూర్చున్నది. అహల్య పుస్తకం చదువుకుందామనుకుంటూనే ఆమెను చూస్తూ తెలియని కలవరపాటుకు గురి అయ్యింది. మంచి పొడగరి, తెల్లని తెలుపు... కాని ఆమె కనీసం ముఖమైనా కడుక్కుని వచ్చిందా అన్నట్టుందామె వాలకం. చీర నలిగిపోయి ముఖం వడలిపోయి పెనుభారమేదో మోస్తున్నట్టు... సముద్రాన్నేదో దాస్తున్నట్టు... నిజమే ఆమె దుఃఖాన్ని కనురెప్పలకింద కప్పిపెట్టే ప్రయత్నం చేస్తున్న కొద్దీ నీవు కాక మాకెవరున్నారంటూ అవి చెంపలకు పాకుతున్నాయి. అది వేలమంది ప్రయాణం చేసే రైలని, ఎదురుగా వున్నవారు తనని గమనిస్తుంటారని తెలిసి ఆమె ముఖం కొంగు నాశ్రయించింది. నేను అశ్రువులను తుడవగలనే కాని కొనగోటితో నీ దుఃఖాన్ని తుడచిపారెయ్యలేను సుమా అన్నట్టు నిస్సహాయంగా ముఖాన్ని కప్పేసిందామె కొంగు. ఆ కొంగు చాటున దుఃఖపు స్వరమూ... నాగరీకపు నిశ్శబ్దాల పోరాటంలో ఆమె భుజాలు ఎగసిపడుతున్నాయి.

కొంతసేపు ఆమె అలా మౌనంగా రోదించాక... అహల్య ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకున్నది. భారంగా తలెత్తి చూసిన ఆమె ముఖం మేఘాల నీడ సాగిపోయిన సముద్రంలా వుంది. అహల్య బాటిల్ తీసి మంచినీళ్ళందించింది. ఆమె మాటకుండా తీసుకుని తాగాక ఒకింత కుదుటపడిన్నట్టయ్యింది. "ఏమిటీ మీ బాధ..?" అని అడగలేదు అహల్య "కాస్త సేదతీరండి చాలాదూరం

ప్రయాణం చెయ్యాలి..." అన్నది. తలపంకించిందామె. రైలెప్పుడు బయలుదేరిందో ఇద్దరికీ తెలియనేలేదు ఒకరిద్దరు తమవంక ఆసక్తిగా గమనిస్తున్న విషయం పట్టించుకోలేదు. అలా కళ్ళు మూసుకుని సీటుకు ఒరిగిందో లేదో ఆమె సెల్ మోగింది.

"నాన్నా రామం నీవు ఎలాగైనా ఈ రాత్రికి బయలుదేరి రావాలిరా... ఒక్కదాన్ని ఉయ్యాల కట్టడం అదీ నాకు రాదు రేపు ఎవరు అందుబాటులో వుంటారో నాకు తెలియదు. రేపు విజయవాడ నుండీ నీరజ కూడా వచ్చేస్తానన్నది. నీవు త్వరగా వచ్చి రాధత్తను సారధి మామయ్యను పలుకరించాలి... అసలు ఆ పిల్ల... ఆ పిల్ల... ఇలా చేస్తుందనుకోలేదురా..."

"అలాగే లేరా నేను ఏడవను లే పెద్దదాన్ని నేను ఏడుస్తూ కూర్చుంటే వాళ్ళకెవరు ధైర్యం చెపుతారు..? చివరకు నా పెద్దరికం ఇలా ఓదార్పులకు పనికి వస్తున్నదిరా... నేను ఏడవను లేరా నువ్వు బయలు దేరి వచ్చేయ్యరా... మనం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేసరికి ధాత్రి వచ్చేస్తుందిరా. "అబ్బా అత్తయ్యా ఎంత బాగుందో..." అంటూ ఇంట్లోకి కూడా వెళ్ళకుండా ఉయ్యాల ఊగేస్తుంది... ఈ లోగానేను తనకిష్టమైన ఉల్లిపాయ పకోడి సేమియా పాయసం చేస్తానురా... అదే కాదు తనకేది కావాలన్నా చేస్తాను..." ఆమె కంఠం దుఃఖంతో వణుకుతుండగా ఫోన్ పెట్టేసింది. అహల్యకు ఏమి అర్థం కాలేదు. ఆ దుఃఖ తీవ్రతలో ముందు ఈమెకు ఏమైనా ఆవుతుందేమో అని భయం వేసింది. లాభం లేదు ఆమెను మాటల్లో పెట్టాలి. బ్యాగ్ లో నుండి బిస్కెట్ ప్యాకెట్ తీసి ఆమెకు ఇవ్వబోయింది... "వద్దమ్మా నేను ఏమీ తినే స్థితిలో లేను అన్నది."

"లేదమ్మా ఏమి చెయ్యాలన్నా కాస్త ఓపిక కావాలి చూడబోతే మీరేదో ముఖ్యమైన పని మీద వెళ్తున్నట్టున్నారు. ఓ రెండు బిస్కెట్లు తింటే కాస్త కాఫీ తాగుదాం. నాకు ఆకలిగావుంది..." అన్నది. ఆమె అహల్య వంక సూటిగా చూసి బిస్కెట్లు తీసుకుని అన్నది. అహల్య మరో రెండు ఇచ్చి తాను తిన్నది. ఇద్దరూ కాఫీ తాగారు... "నీవెవరో గాని తల్లి నిజంగానే కాస్త ఓపిక వచ్చింది. ఇవాలే కాదూ నిన్నా నేను ఏమి తినలేదు ఎలా తింటాను చెప్పుధాత్రిని అలా చూస్తుంటే..!" కాస్త ఆగింది.

"నాపేరు... అహల్యండీ నేను పనిమీద హైద్రాబాద్ వచ్చాను. ఇప్పుడు ఖమ్మం వెళ్తున్నాను. అక్కడ ఆంధ్రా బ్యాంక్ లో క్లర్క్ గా చేస్తున్నాను..." అహల్య మాటలను పెంచాలన్న ప్రయత్నిస్తున్నది.

"నా పేరు సావిత్రి... అత్తయ్యా నా పేరు ధాత్రి నీ పేరు సావిత్రి భలే కలిసాయి కదూ అంటుంది ధాత్రి... ఏదోలేమ్మా ఏదో పాత పేరు అంటాను నేను. పేరేదైతేనేం అత్తయ్యా నీ పక్కన మేమెవరం నిలబడ్డా వెల వెల బోతాం... ఇప్పుడే ఇలా ఉన్నావంటే మంచి వయసులో వున్నప్పుడు ఇంకెలా వుండేదానివో అత్తయ్యా..." అంటుంది "నీకేమే చక్కని చుక్కవి." అంటాను నేను "లేదత్తా నీ అంత రంగు లేను చూడు నీవెంత తెల్లగా ఉన్నావో మా అమ్మెందుకత్తా నన్నిలా పుట్టిచ్చింది. నీ అంత రంగుంటేనా..." అంటుంది. "రంగుంటే ఏం చేస్తావు ధాత్రి నీకు మంచి మనసుంది. నీ కలుపు గోరుతనం నీకు రక్ష. నీ చిరునవ్వుతో జనాన్ని గెలుచుకుంటావు. ఎవడొస్తాడోగాని చాలా అదృష్టవంతుడు అంటాను నేను... "అబ్బా వదినా మీరలా పొగిడితే అది భూమ్మీద ఆగుతుందా అంటూనే

దిష్టి తీసేస్తుంటుంది రాధ. అంటే నా దిష్టి తగులుతుందనా చూడయ్యా సారధీ మీ ఆవిడ గడుసుదనం అంటాను నేను.. అత్తయ్యా చుక్క కూర చేసావా... అడుగుతుంది చేసాపమ్మా నాకు కాస్త వుంచుకుని మొత్తం నీకు పైకి పంపాను... అనగానే మా మంచి అత్తయ్యా అంటుంది..."

"కిందటి నెల ఓ అర్ధరాత్రి "అత్తయ్యా... అత్తయ్యా" అంటూనన్ను నిద్ర లేపింది అమ్మో రాధకో సారధికో ఏమైనా కాలేదు కదా అనుకుంటూ లేచాను "ఏంటమ్మా?" అంటూ ఉలిక్కి పడిలేచాను "ఇలా రా అత్తయ్యా అంటూ నన్ను పెరట్లోకి లాక్కెల్లింది. అప్పటికే అక్కడ రెండు కుర్చీలు వేసింది. "ఇక్కడ కూర్చో అత్తా నేను చూడాలి.." అన్నది.

'ఈ అర్ధరాత్రి ఏమి చూడాలి ధాత్రి.?" అయోమయంగా అన్నాను నేను.

"వెన్నెల అత్తయ్యా వెన్నెల... ఈ వెన్నెల్లో రాలుతున్న పారిజాతాలను చూడాలి అవి నేలన రాలకుండా నేను వాటిని నా వడిలోకి పట్టుకోవాలి... తెల్లారే వరకూ నా వడి నిండిపోవాలి..." అది ధాత్రేనా అని అనుమానం కలిగింది. దీనికి ఏ వనదేవతో పూనలేదుకదా అనిపించింది...

"అత్తయ్యా నేనొక్కదాన్నే వస్తే అమ్మా నాన్నా నన్ను చంపేస్తారు పాపం నీ నిద్ర చెడగొట్టాను కదూ... పొద్దున్నే పడుకుందువులే కావలిస్తే నీకు నేనే వంట చేసి పెడతా... చూడు ఆ నింగి కాసిన్ని నక్షత్రాలను పొన్న చెట్టుకూ... కాసిన్న నక్షత్రాలను పారిజాతాలకు పంచింది. గాలి వాటికి గంధం పూసింది. నేలతల్లికి చెట్టు పుష్పాబిషేకం చేస్తున్నది. నాకూ కొన్ని ఇవ్వూ అన్నాను చూడు ఎన్ని పూలనిచ్చిందో..." ఇలా మాట్లాడుతుందమ్మా ధాత్రి...

"మనిద్దరం కల్సి నర్సరీ పెట్టేద్దాం అత్తయ్యా అంటుంది... ఎక్కడ నుండో పొన్నపూలు ఏరుకొచ్చి అన్ని గదుల్లో అరమరల్లో వేస్తుంది ఏ పెర్ ఫ్యూమ్స్ పనికి వస్తాయి వీటి ముందు అంటుంది. ఏ పండగ వచ్చినా బుట్టెడు పూలు తెచ్చి నన్నూ రాధను కూర్చోబెట్టి దండలు గుచ్చి గుమ్మాలకు వేస్తుంది. చామంతుల కాలంలో నెలకు రెండు సార్లయినా పచ్చచామంతులు, తెల్లచామంతులు, చిట్టి చామంతులు కేజీల కొద్దీ తెచ్చి పోస్తుంది. నేనూ రాధ ధాత్రి కలిసి దండలు గుచ్చుతాము. బాబా గుడికెళ్ళి తన చేత్తో ఆ మాలలు వేస్తుంటుంది. నెలకోసారి రొట్టెలు చేసి గుడి మెట్ల దగ్గర బిచ్చగాళ్ళకు పంచుతుంది."

"నేనంటే వల్లమాలిన ప్రేమ. తను చేసే ప్రతి పనికీ సాగర్ రాధమ్మల నుండి తిట్లు పడకూడదంటే నన్ను అడ్డు పెట్టుకుంటుంది. అలాగని పిచ్చి పనులేమి చెయ్యదు. తన పుట్టినరోజుకి సేవాశ్రమంకి వెళ్ళి పండ్లు పంచింది. వారానికోసారి వెళ్ళి వాళ్ళకు వారపత్రికల్లో కధలో భారత భాగవతాలో చదివి వినిపిస్తుంటుంది. వాళ్ళ నాన్నకు దాన్ని బీటెక్ చేయించాలని... తనకేమో బీఏ

చదివి ఐ ఏ ఎస్ చెయ్యాలని... అప్పుడు కూడా వాళ్ళమ్మా నాన్నతో నాతోనే చెప్పించింది. వారానికి రెండు మూడు రోజుల కింద పోర్షన్ లో నా దగ్గరే పడుకుంటుంది. ఎంత అర్ధరాత్రి వరకు చదువుకున్నా ఓపికవున్నా లేకున్నా అలారం పెట్టుకుని మరీ సూర్యోదయం చూస్తుంది. నన్నూ వాకిట్లోకి లాక్కొచ్చి చూపిస్తుంది. ఆ తరువాత పడుకుంటే పడుకుంటుంది. లేదా మళ్ళీ చదువు మొదలెడుతుంది. నీ బీఏ పూర్తయ్యాక కదా ఐఏఎస్ ఇప్పటినుండీ ఇంత శ్రమ ఎందుకమ్మా అంటాను. "లేదత్తా ఏం చదవాలో నిర్ణయమయ్యాక ఎలా చదవాలో కూడా తెలుస్తుంది... ఎన్నో నోట్స్ లు తయ్యారు చేసుకోవాలి" అంటుంది. ఇలాంటి పిల్లను మరి చూడం.

"దాని పుట్టిన రోజుకు వాళ్ళ అమ్మానాన్నా పట్టులంగా ఓణి కొన్నారు నేను గాగ్రా కుట్టించాను. అది వేసుకున్న ధాత్రి నిజంగా ఓ రాకుమారిలా వుంది. వాళ్ళ అన్నయ్య అమెరికాలో వున్నాడు ఈ వార్తను విని ఎలా తట్టుకుంటాడో... అసలు ఆ హాస్పట్లో అది అలా పడుకుని వుంటే నా ప్రాణం కొట్టుకుపోతున్నది. ఇక వాల్లమ్మా నాన్నలకు ఎలా వుంటుందో చెప్పమ్మా..?" ఆమె ఎదలోని మాటల వెల్లువ దుఃఖంతో మేళవించి బయటకు వస్తూంటే ఎక్కడా ఆపలేదు అహల్య.

"పుట్టిన రోజయ్యాక కూడా నెల రోజులు బాగానే ఉంది. కాస్త జ్వరం వస్తే మొదట్లో పట్టించుకోలేదు మొండిగా తిరుగుతుంటే నేనే కోప్పడి డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాను. రెండు రోజుల్లో కాస్త తగ్గింది. ఇక ఆగదుగా ఏదో కోచింగంటూ, ఆశ్రమమంటూ, కోవెలంటూ, స్నేహితులంటూ ఎప్పటిలా తిరిగింది. మళ్ళీ జ్వరం ముదరబెట్టింది. సారధికి కాస్త భయమేసి ఖమ్మంలో చూపించాడు. ఈ సారి మందులకు పిల్ల భలే కోలుకుంది. ఎప్పటిలా చలాకీగా తయారయ్యింది. నేను మాత్రం ఇలా అర్ధరాత్రులవరకూ చదవద్దు పెందలకాడ పడుకో అని కోప్పడుతూనే వున్నానమ్మా... నాకు మాత్రం ఎవరున్నారు అబ్బాయికి నెల్లూరులో ఫుడ్ కార్పోరేషన్ లో వుద్యోగం. వాడికి ఇద్దరు పిల్లలు. అమ్మాయికీ పెళ్ళయి విజయవాడలో ఏదో కాలేజీలో లెక్చరర్ గా చేస్తున్నది. అల్లుడు కూడా పాలిటెక్నిక్ కాలేజీలో లెక్చరర్. ఎవరు వచ్చినా రెండు రోజులుండడం గగనం. నేను రిటైర్ అయ్యిన దగ్గరనుండీ మరీనూ... నా ప్రాణాలన్నీ ధాత్రి మీదే పెట్టుకుని బతుకుతున్నా అది కూడా అంతే ఈ ఐదారేళ్ళలో ఎంత చేరువయ్యిపోయిందంటే..." సావిత్రి కళ్ళు వర్షించసాగాయి. ఆమె మళ్ళీ కొంగుతో ముఖం తుడుచుకున్నది. అహల్య సావిత్రి వైపుకు వంగి చెవులు రిక్క బొడుచుకుని వింటున్నది...

"అక్కయ్యా నా చిట్టి తల్లికి ఏ అమెరికా సంబంధమో చేస్తాను అంటాడు వాళ్ళనాన్న... "నాన్నా... అన్నయ్యా దూరమై ఎంతో బాధపడుతున్నారు. ఇక నేను కూడా అమెరికా కెళ్ళి కూర్చుంటే మీరిద్దరూ ఏదైనా ఆశ్రమంలో చేరుతారా... సమస్యే లేదు. నాకు మిమ్మల్ని చూడాలనిపించినా మీకు నన్ను చూడాలనిపించినా కనీసం మూడు, నాలుగంటల్లో రాగలగాలి... అలా అయితేనే చేసుకొంటాను" అనేది... అకస్మాత్తుగా మూడోసారి మంచాన పడ్డదమ్మా... అప్పుడు జరిగాయి పరీక్షలన్నీ... దాని రోగానికి లుకేమియా అని పేరు పెట్టారు డాక్టర్లు"

"ఇపుడు నా సమస్యంతా రాధా, సారధి ఎలా తట్టుకుంటారని కాదు... ఇది ఎవరూ ఊహించనిది... విధి లిఖితం మనచేతుల్లో

ఏమీ లేదు మనకింతే ప్రాప్తం అనుకోవాలి... ధాత్రి అందరు అమ్మాయిలాంటిది కాదు... అది జీవితాన్ని ఎంతో ప్రేమిస్తున్నది. తన చదువు గురించి తన భవిష్యత్తు గురించి తనకు కోటి కోర్కెలున్నాయి. అమ్మానాన్నల మీద మమకారం ప్రేమా వున్నాయి. తన ఆశయాలపట్ల బోలెడన్ని ప్రణాళికలున్నాయి. అలాంటిది తన బ్రతుకు అర్ధాంతరంగా ఆగిపోతున్నదని తెలిస్తే తట్టుకోగలుగుతుందా! అందుకే చెప్పాను తనకు కాస్త జ్వరమే తగ్గి పోతుందని చెప్పి కాస్త మత్తుగా ఉండగానే ముందా కాన్సర్ ఆసుపత్రి నుండి మంచి హోటల్ కి మార్చెయ్యండి అని. అడ్వాన్స్ డ్ స్టేజిలో వున్న తనుకు కిమో థెరపీలు ఇచ్చి కడాయిలో వేపినట్టు వేపద్దని.".

"నేనూ సారథీ ఒకరిద్దరు డాక్టర్లను కనుక్కున్నాము. ఇంకా నెలలు అని కూడా చెప్పలేము... రోజుల్లో కూడా ముగిసిపోవచ్చు... మొదట్లో రెండుగా వున్న కాన్సర్ కణాలు నాలుగవుతాయి... చివర్లో రెండు లక్షల కణాలు నాలుగు లక్షలు, ఎనిమిది లక్షలు, పదహారు లక్షలు... ఇలా రెట్టింపవుతాయి. ఏ క్షణమయినా మరణం సంభవించవచ్చు. ఆ థెరపీలతో మరో రెండునెలలు జీవిత కాలాన్ని పెంచగలమేమోగాని... లేచి ఆరోగ్యంగా తిరిగే అద్భుతమేది జరగదు. థెరపీస్ ఇప్పించే సమయంలో వచ్చే ఎన్నో విషమ పరిణామాలను ఆ శరీరం తట్టుకోవాల్సివుంటుంది అన్నారు... అందుకే ఇక వైద్యం కోసం వెంపర్లాడక తనకు తనకిష్టమయిన ప్రశాంత వాతావరణంలో వుంచాలని తాపత్రయ పడుతున్నాం...

"ఈ రాత్రికే తనని హోటల్ గదిలోకి మార్చేస్తాము. రేపు సాయంకాలం వేళకు మధిర తీసుకొచ్చేస్తారు. తన కోసం నేను ముందే వెళ్ళి ఇల్లంతా సర్దాలి... సమయానికి పారిజాతాలు పూస్తున్నాయి. అవి చూసే తన కోసం రాత్రంతా జాగారం చేస్తాను. వీలైనన్ని పూలకుండీలు తెప్పించి పెడతాను. ఎప్పటినుండో ఇంటి ముందున్న మామిడి చెట్టుకు ఉయ్యాల కట్టమని గొడవ పెడుతుంది. ఇప్పుడది కట్టాలి. తెల్లారే మా అబ్బాయి వస్తాడు. చుట్టుపక్కల వారిని బతిమాలుకోవాలి. కాస్త సాయం చెయ్యమని... ధాత్రికి ఏమి చెప్పొద్దని... అది ఏ సూర్యోదయమో చూసి ప్రశాంతంగా నిదురించిన వేళో... పారిజాతాలు ఏరుకుని అలిసిపోయి పడుకున్నవేళో నిద్దట్లోనే పోవాలి. తను చచ్చిపోతున్నానని తనకు తెలియకుండానే పోవాలి... భగవంతుడా ఈ ఒక్క కోరికా తీర్చు..." గొల్లుమంది సావిత్రి.

ఎప్పటినుండి వింటున్నారో మిగతా ప్రయాణికులు కళ్ళు తుడుచుకుంటున్నారు. అహల్య ఆమెను అక్కున చేర్చుకున్నది. అలా ఎంతసేపు గడిచిందో ఖమ్మం స్టేషన్ రానే వచ్చింది. అహల్యకు సావిత్రిని వంటరిగా వదిలి దిగిపోబుద్ధి కాలేదు. ఇంతలో అహల్యకోసం వెతుక్కుంటున్న ఆమె శ్రీవారు కిటికీలోనుండి కనపడ్డారు...

"అమ్మా ఇక నేను దిగిపోవాలి మీరు ధైర్యంగా వుండాలి..." అన్నది.

"అయ్యో..! పిచ్చితల్లి నేను ధైర్యంగానే వుంటానమ్మా నేను చెయ్యాల్సిన పనులు చాలా వున్నాయి. ఎన్నాళ్ళనుండో ధాత్రి

అడుగుతున్న వుయ్యాల కట్టాలి. ధాత్రిని సంతోష పెట్టాలి. చివరన ఆ దేవునికి మనసైన రోజన మరో ఊయల కట్టి తరలించాలి... ధాత్రి చూపులేమో ఆకాశం వంక... కాని ధాత్రిని తనలో కలుపుకునేందుకు ధరిత్రి వేచివున్నది కదా..." ఆ సాగరికను చూసి మరిక తట్టుకోలేక తప్పదు కనుక అహల్య దిగిపోయింది. విడువలేక విడువలేక వెళ్తూ కిటికీ దగ్గరకు చేరి మళ్ళీ ఆమె రెండు చేతులూ పట్టుకున్నది.

"అమ్మాయి నీవెవరో గాని నా బాధంతా నీకు చెప్పుకుంటే కాస్త మనసు తేలిక పడింది. అయినా ఈ ప్రపంచంలో ఎవరికి ఎవరూ కనుక... ఎన్ని సార్లు అనుకున్నానో ఈ సారి నుండి అద్దెకున్న వారితో ఇంత అనుబంధం పెట్టుకోవద్దూ... తీరా ఏ ట్రాన్స్ ఫరో అయి వాళ్ళు ఇల్లు ఖాళీ చేసి వెళ్తున్నప్పుడు ఎంతో బాధపడాల్సి వస్తున్నది అని... చూసావా అమ్మాయి ఇపుడా పిల్ల తన గూడే వదిలి వెళ్ళిపోతున్నది..!" సావిత్రి కళ్ళు వర్షిస్తూనే వున్నాయి. రైలు వేగం పుంజుకున్నది.

***



అమ్మ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది అత్తయ్య, మావయ్య మా ఇంటికి వస్తున్నారని, నేను దూరదేశం వచ్చాక అత్తయ్య మా ఇంటికి ఎప్పుడూ రాలేదు.

నామనసు పాతజ్ఞాపకాల్లోకి పగ్గాలు వదల్చుకుని పరుగెట్టింది.

అందులో అత్తయ్య పెళ్ళిచూపుల ప్రహసనం తల్చుకుంటే ఇంకా నాకు కళ్ళకు కట్టినట్లుగా ఉంటుంది.

నేను చిన్నవాణ్ణే అయినా ఆనాటి సంగతులు నాకు ఇప్పటికీ గుర్తే.

పెళ్ళివారు వస్తున్నారని రెండురోజుల్నించి తెగ హడావుడి మొదలయ్యింది.

నాయనమ్మ మరీ గంగాళాల దగ్గర్నుంచి తోమించేసింది. పెళ్ళివారికి కాఫీలు గంగాళాలతో కాచి చెంబుల్తో ఇస్తారా!

లేక అత్తయ్యతోబాటు వాళ్ళు మాగంగాళాలు కూడా చూస్తారా!

అన్న పెద్దఅనుమానం నాచిన్నిబుర్రలోకి వచ్చేసింది.

ఎవర్నైనా అడుగుదామంటే “కుర్రవెధవ్వి నీకెందుకురా” అంటారని భయం. అందుకే నోరు మూసుకున్నాను.

అత్తయ్య పెళ్ళిచూపుల పేరుచెప్పి మాకందరికీ కొత్తబట్టలు వచ్చాయి.

కొత్తబట్టలు ఎప్పుడూ ఎరగవనుకుంటారేమో!

మాతాతగారు కలిసొస్తుందని ఒకేతానులో అబ్బాయిలకి లాగులు, చొక్కాలు, అమ్మాయిలకి పరికిణీలు, గౌన్లు కుట్టించేవారు. పెళ్ళిళ్ళల్లో బాండ్వాయించే వాళ్ళల్లా అందరం ఒకటే రంగుబట్టల్లో దర్శనం ఇచ్చేవాళ్ళం.

చుట్టుపక్కలవాళ్ళు బాండ్మేళం అని వేళాకోళం చేసినా ఏమనడానికి లేదు.

అనాడు తాతయ్యను తిట్టుకునేవాళ్ళం. ఇప్పుడు ఫాషన్ పేరుతో ఆడవాళ్ళు, మగవాళ్ళు అందరూ వేసుకునే జీన్స్ బాండ్మేళం డ్రెస్లాగే ఉంటోంది కదా అనిపిస్తుంది.

మొత్తానికి అనుకున్న రోజుకు పెళ్ళివారు వచ్చారు. రెండు కార్లనిండా జనం వచ్చారు.

పెళ్ళిచూపులకే ఇంతమంది వస్తే పెళ్ళికి ఎన్ని బస్సుల్లో వస్తారో అన్న అనుమానం నాకు రాకపోలేదు. నాఅనుమానాలు బైటపెడితే నావీపు విమానం మోత మోగడం ఖాయం.

కతికితే అతకదంటూ నాయనమ్మ ఏంపెట్టాడానికి వీలులేదంది.

కానీ నాన్న బాగుండదంటూ బైటినుంచి ఉల్లిపాయ పకోడీలు రెండురకాల తీపిపదార్ధాలు తెచ్చారు.

అందులో నాకు ఇష్టమైన పాలకోవా కూడా ఉంది. అమ్మపక్కన మెల్లిగా చేరి “వాళ్ళు ఎప్పుడు వెళ్ళిపోతారమ్మా!” అన్నాను.

“తప్పమ్మా అలా అనకూడదు. అయినా ఎందుకలా అడుగుతున్నావు?” అంది అమ్మ.

“వాళ్ళు వెళ్ళేదాకా నాకు నువ్వు పాలకోవా పెట్టవుకదా!” అన్నాను.

అమ్మ చిరునవ్వు నవ్వి, “వాళ్ళతో బాటు నీకు కూడా పెడతాలే” అంది.

అత్తయ్యను తీసుకువచ్చి చాపమీద కూర్చోబెట్టారు. అత్తయ్య అంతబుద్ధిగా కూర్చోవడం నేను మొట్టమొదటిసారి చూస్తున్నాను.

ఎందుకంటే అత్తయ్య తనమాట నెగ్గించుకుందుకు అపరకాళికలా అవతారంఎత్తి సూర్యకాంతం లెవెల్లో దెబ్బలాడుతుంది.

పెళ్ళికొడుకు తరఫువాళ్ళు అమ్మాయికేమైనా పాటలువచ్చా! అనిఅడిగారు. ఏం పెళ్ళిఅయ్యాక పాటకచేరీలు చేయిస్తారా లేక సినిమాల్లో పాడమంటారా!

నావెధవ చిన్ని బుర్రకు వయసుకు మించిన ఆలోచనలు.

అత్తయ్య తనకొచ్చిన ఏకైకపాట మాఊళ్ళోఉన్న సంగీతం మాష్టారిదగ్గర నేర్చుకున్న పాట మొదలుపెట్టింది. “నను పాలింప నడచివచ్చితివో నాప్రాణనాథా!” అంటూ.

మళ్ళీ నావెధవబుర్రలో సణుగుడు మొదలు. “అదేమిటి పెళ్ళికొడుకు కార్లోవచ్చాడు కదా!

అత్తయ్యేమిటి నడిచి వచ్చాడంటుంది. ప్రాణ నాథుడంటే అర్థం ఏమిటో? అమ్మను అడిగాను.

అప్పటికే నా గుసగుసలతో విసిగిపోయిన అమ్మ తంతానన్నట్లుగా తర్జని చూపించింది.

నాకు మళ్ళీ సందేహం పెళ్ళివారు ఇంకోపాట పాడమంటే అత్తయ్య ఏంచేస్తుంది? అత్తయ్యకు వచ్చిందే ఒకపాట. కానీ అత్తయ్యను వాళ్ళు ఇంకోపాట అడగలేదు.

ఆ తరువాత అమ్మను అడిగాను ప్రతీ పెళ్ళిచూపుల్లో అమ్మాయికి పాటవచ్చా! అని ఎందుకు అడుగుతారని?

“అన్నీ సందేహాలే నీకు అమ్మాయికి సరిగా మాటలువచ్చో లేదో తెలుసుకోవడానికి అలా అడుగుతారు” అంది అమ్మ.

“మరి అలాంటప్పుడు పెళ్ళికొడుక్కు కూడా మాటలొచ్చో లేదో తెలియడానికి అతన్ని కూడా పాడమని అడగచ్చుకదా!” అన్నాను.

“నోరు మూసుకోరా బాబూ నీయక్ష ప్రశ్నలకు సమాధానం చెప్పడం నావల్లకాదు”

ఈ పెద్దవాళ్ళంతా ఇంతే పిల్లల్ని అస్సలు అర్థంచేసుకోరు. నేను కూడా బుడుగులా ఆలోచిస్తున్నానా!

బుడుగుకైతే ఇంచక్కా సీజానపెసూనాంబ ఉంది. నాకైతే ఎవరూలేరు.

ఒకసారి పక్కింటి మీనాక్షిని అడిగాను నేను బుడుగు, నువ్వు సీజానపెసూనాంబ అని. ఛీ నువ్వుబుడుగేంటి? నేను సీజానపెసూనాంబ ఏమిటి? అంటూ తన చిమిడిముక్కు తుడుచుకుంటూ వెళ్ళిపోయింది.

ఇంత జరుగుతున్నా తాతయ్య మాత్రం పడక్కుర్చీలో కూచుని జేబులోఉన్న ముక్కుపొడుండబ్బాతీసి రెండువేళ్ళతో ముక్కుపొడుంతీసి ‘డుర్రు’మని శబ్దంచేస్తూ ముక్కుపొడుంపీల్చి ఆతర్వాత వేళ్ళకంటుకున్న పదార్థాన్ని అక్కడ ఏదుంటే దానికిరాసేసి, నాన్నమ్మ చూస్తే చివాట్లు తినేసి, చిదానందస్వామిలా నవ్వుతారు. అందుకే తాతయ్యంటే నాకు చాలాఇష్టం.

నాన్నమ్మకూడా ఇష్టమేకానీ అస్తమానూ ‘భడవా’ అంటుంది. దానిఅర్థ ంఅప్పట్లో నాకూ తెలియదు.

పెళ్ళివారే అన్నిప్రశ్నలూ అత్తయ్యను అడుగుతున్నారన్న ఉక్రోషమో ఏమిటో నాన్నమ్మ సడన్ గా అడిగింది “అబ్బాయి ఏం చదువుకున్నాడు?” అని.

"ఇంజనీరింగ్ పాసయ్యాడు మాఅబ్బాయి" అంటూ సమాధానం ఇచ్చింది పెళ్ళికొడుకు తల్లి.

"ఏటిగట్టు ఇంజనీరా! దీపాల ఇంజనీరా!" అంది నాయనమ్మ తనకుకూడా ఏదో తెలుసన్న పోజులో.

ఆవిడ ఏమడిగిందో అర్థంకాక తెల్లమొహం వేసారు పెళ్ళివారు. ముందుగా తేరుకున్న నాన్న, "మా అమ్మగారి భాషలో ఏటిగట్టు ఇంజనీర్ అంటే సివిల్ అని దీపాల ఇంజనీర్ అంటే ఎలెక్ట్రికల్ అని అర్థం" అని వివరించారు.

అందరూ ఒక్కసారి గొల్లుమని నవ్వారు. పెళ్ళికొడుకు నవ్వుతూ నేనుదీపాల ఇంజనీర్నండీ" అన్నాడు.

అంతటితో ఊరుకోలేదు నాన్నమ్మ. "మీ ఇంట్లో గాస్బుడ్డి ఉందా! దాని తొండం అప్పుడప్పుడు జాగ్రత్తగా చూసి మార్చాలట కదా! లేకపోతే ప్రమాదం జరుగుతుంది"

ఇంకాస్సేపుంటే నాన్నమ్మ మాటలకు వాళ్ళకు పిచ్చి ఎక్కడం ఖాయం అనుకున్నాను. వాళ్ళు ఆముదం తాగిన మొహాలతో నాన్నగార్ని చూసారు.

"మా అమ్మగారి పరిభాషలో గాస్బుడ్డి అంటే సిలిండర్. తొండం అంటే దాని ట్యూబ్.

ఈమధ్యనే మాఊరికి గ్యాస్ కనెక్షన్ వచ్చింది. ప్రతీ ఆరునెలలకూ గ్యాస్టూబ్ మార్చాలని లేకపోతే దాంట్లో లీకేజ్ ఉంటే ప్రమాదం జరుగుతుందని చెప్పారు.

అందుకే మీరు ఆజాగ్రత్తలు పాటిస్తున్నారా లేదా అన్న అనుమానాన్ని ఆవిడ వ్యక్తం చేస్తున్నారు" అంటూ నాన్నగారు పెళ్ళివారితో క్షమాపణ ధోరణిలో చెప్పారు.

వాళ్ళు కక్కలేక మింగలేక ఇంకాసేపు ఉంటే ఇంకా ఎలాంటి మాటలు వినాల్సి వస్తుందోఅని ఇంక వెడతామని లేచారు.

మళ్ళీ నాచిన్ని బుర్రలో గందరగోళం మొదలు. అయ్యో నాన్నమ్మ అంతకష్టపడి ఇల్లు, పెరడు శుభ్రం చేయించింది. మా గంగాళాలు వాళ్ళుచూడనే లేదన్న బెంగ.

ఊరుకోలేక అప్పటికీ అమ్మతో అన్నాను. అమ్మ మళ్ళీ తంతానని వేలుచూపించి మళ్ళీ నాఏడుపు మొహం చూసి, “ఏవరో చూస్తారనికాదు నాన్నా అదో వంక ఇల్లు శుభ్రం చేసుకుందుకు. అందుకే పండగలప్పుడు కూడా ఇల్లంతా శుభ్రం చేస్తాం” అంటూ వివరించింది.

పెళ్ళివార్ని సాగనంపడానికి నాన్న అలాబైటికి వెళ్ళగానే మా పిల్లమూక అంతా కరువో కాటకమో అన్నట్లు తినుబండారాలమీద కోతుల్లాగా దూకాము.

ఇంక మమ్మల్ని ఆపడం తనవల్ల కాదనుకుందేమో అమ్మకూడా ఊరుకుంది.

మనలో మనమాట ఇప్పుడు నాఇంట్లో ఆవేషాలు చెల్లవు. మాఆవిడో హిట్లర్ ఏమిటో అంతా డిసిప్లిన్ అంటుంది.

సంతోషం వచ్చినప్పుడు పిల్లపినుగులు అల్లరిచెయ్యడానికి డిసిప్లిన్ ఎందుకో నాకు అర్థంకాదు. ఈవిషయంలో మా అవిడకన్నా మాఅమ్మ బెస్ట్ అమ్మ.

నాకే అధికారం ఉంటే మాఅమ్మకు పద్మశ్రీ ఇచ్చేవాడ్ని. పద్మశ్రీ ఏంఖర్మ పద్మవిభూషణ్ ఇవ్వండి అని మాఆవిడ వేళాకోళం చేస్తుంది.

ఇంతకీ పెళ్ళివారు వెళ్ళిపోయాక ఏమైందో చెప్పలేదు కదూ!

మానాన్నగారు లోపలికి వచ్చి “ఈ సంబంధం కుదురుతుందా! అమ్మ మాటలకు వాళ్ళు ఏమనుకున్నారో! అమ్మను ఏమనలేని బలహీనత” అన్నారు నాన్నగారు.

“ఏం పరవాలేదు మనమ్మాయి చక్కగా ఉంటుంది. వాళ్ళకు కావాల్సిన ముద్దు ముచ్చట్లు మనం తీరుస్తాము.

అత్తగారు ఎలా ఉంటే అలాగే స్వీకరించాలి. ఒకరోజు, రెండురోజులో ఉండేవాళ్ళ కోసంఐతే మనను మనం కాసేపు అదుపులో పెట్టుకోగలుగుతాము.

జీవితాంతం ఉండేవాళ్ళు మనం ఎలాఉంటే అలాగే స్వీకరించాలి” అంది అమ్మ.

అమ్మ అన్నట్లుగా జరిగింది. మావయ్యగారు మాఇంటి అల్లుడయ్యారు.

నాన్నమ్మతో సమంగా మమ్మల్నందర్నీ నవ్వులతో ముంచెత్తడంలో మావయ్యగారికి ఎవరూ సాటిరారు. మావయ్యగారు, అత్త వస్తున్నారంటే నాకందుకే ఆనందం.

మాఇంట్లో నవ్వుల పువ్వులు విరుస్తాయి.

మావయ్యగారు ఆసు కవిత్వంలో అందెవేసిన చెయ్యి. మచ్చుకు

‘పేడకోసమై గేదెను కొనెనె పాపం ముసలమ్మ అయ్యో పాపం ముసలమ్మ’ అంటూ పాటలన్నీ తనపేరడీలుగా మార్చడంలో అందెవేసిన చెయ్యి.

మావయ్యగారు చెప్పిన ఒక జోక్ చెప్పనా! ఒకసారి ఏమయ్యిందంటే కోపం వచ్చిన భార్య భర్తకు ఫోన్ చేసి, “మీరెక్కడ తగలడ్డారు” అని అరిచిందట.

అప్పుడు మొగుడు శాంతంగా “నీకు జ్ఞాపకం ఉందా! మనం మొదటిసారి డైమండ్స్ అమ్మే దుకాణంలో కలుసుకున్నాము.

అప్పుడు నువ్వు అక్కడ ఒకఅందమైన నెక్లెస్ ను చూసి మురిసిపోయావు, అప్పుడు నాదగ్గర డబ్బులేక నేను కొనలేదు. ఏదో ఒకరోజు ఆ నెక్లెస్ నాదవుతుందని నేను అన్నాను కదా!”

“అవునవును నాకిప్పటికీ ఆసంఘటన గుర్తుందండి. నిజంగా మీరెంత మంచివారండీ” అంటూ సడన్ గా గొంతులో ప్రేమనింపి మాట్లాడ్డం మొదలుపెట్టింది.

“పూర్తిగా విను ఆ డైమండ్ షాప్ పక్కనున్న సారా కొట్లో ఉన్నాను నేను” అన్నాడు.

మిగిలినది అత్త, మావయ్యలు వచ్చాక నవ్వుకుందాం.

***



సమయం... మధ్యాహ్నం పదకొండున్నర గంటలు

ప్రదేశం... స్మశానం.

సంఘటన... శవం కాలుతుంది.

కాటికాపరి నిర్లిప్తంగా తన పని తాను చేసుకుంటూ పోతున్నాడు. చితి చుట్టూ దాదాపుగా ఇరవైమంది దాకా జనం వున్నారు. అందరి ముఖాలు గంభీరంగా, విషాదంగా వున్నాయి. విషాదం అంటే పూర్తి విషాదం కూడా కాదు. కొందరం కొంచెం ఇవతలికి వచ్చి అరచేయి అడ్డు పెట్టుకుని, లో గొంతుకలలో సెల్ ఫోన్ లో మాట్లాడుతున్నారు. ఇంకొందరు బ్లాంక్ ఫేస్ లతో చితి వంకే చూస్తున్నారు. మళ్ళీ అది దుఃఖం కూడా కాదు 'ఎంత త్వరగా తతంగం పూర్తవుతుందా?' అనే ఇరిటేషన్ క్షమించాలి అసహనం కావచ్చు వాళ్ళ బుర్రలో ఏ ఆలోచనలు తిరుగుతున్నాయో సరిగ్గా వాళ్ళకే తెలీదు ఇంక మనకేం తెలుస్తుంది?

కపాలం 'ఫట్' మంటూ పగిలింది.

గుంపులోని జనం కొందరు 'గోవిందా' అనుకున్నారు. 'ఇక ఎళ్ళండి... ఇక్కడుండి మీరు చేసేదేమీ లేదు..." కాటికాపరి కొంచెం అసహనంగా చెప్పాడు. అతని కోపం అతనిది. అడిగిన మొత్తంలో సగం బేరం ఆడి డబ్బులు చేతిలో పెట్టారు పైగా కట్టెలు, కిరోసిన్ అన్నీ వాళ్ళే తెచ్చుకున్నారు. "ధూ... కక్కుర్తి నాయాళ్ళు... ఎప్పటికైనా ఈడకి రాకపోరు... అప్పుడు చెబుతా మీ పని..." కసిగా తనలో తనే గొణుకుతున్నాడు. వాళ్లొచ్చేసరికి ఈయనే అప్పుడూ కాటికాపరిలాగా వుంటాడా అన్నది వేరే ప్రశ్న.

"వాడెంత ఫోజ్ కొడుతున్నాడో చూశారా? ఎంత డబ్బిచ్చినా చాలదు వెధవకు... శవాల మీద వ్యాపారం అంటే ఇదే కాబోలు..." ఓ పెద్ద మనిషి తన ప్రక్కనున్న ఇంకో పెద్దమనిషితో అంటున్నాడు.

"అందుకే హాయిగా ఎలక్ట్రిక్ క్రిమిటోరియమ్ లో చేయిస్తే పోయేది..."

"గంధపు చెక్కలతో తగలబెట్టాలని ఆయన కోర్కె... బాగానే సంపాదించాడు కదా ఏదైనా కోరుకుంటాడు..." అని గొంతు తగ్గించి "అన్నట్లు మీరు ముప్పైనో, అరవై లక్షలో ఇవ్వాలంటగా బైట జనం టాక్..." అన్నాడు.

ఆ పెద్ద మనిషి సీరియస్ గా చూశాడు "చచ్చినోడు వచ్చి నీతో చెప్పాడా? పోనీ నోటూ, పత్రం వుందా? ఎవడిష్టం వచ్చినట్టు వాడనుకుంటే దాంతో నాకేం సంబంధం?" గట్టిగానే అన్నాడు.

స్మశానం దగ్గర్లో గజం భూమి ధర ఎంత వుంది? దినానికి మేకపోతులు ఎక్కడ నుండి తెప్పించాలి? ముగ్గురు కొడుకులు ఆస్తి పంచుకుంటే ఒక్కోడికి ఎంత వస్తుంది? ఏ కొడుకుతో మంచిగా వుంటే లాభం? కూతురు ఆస్తిలో నాకూ వాటా వుందని కోర్టులో కేసు పెడుతుందా? నిజంగానే ఆయుష్షు తీరి చచ్చిపోయాడా లేకపోతే ఆస్తికోసం ఇంట్లో వాళ్ళే మందు పెట్టి చంపేశారా? పిల్లికి బిచ్చం పెట్టకుండా అడ్డమైన పనులూ చేసి ఎన్ని కోట్లు వెనకేసి ఉంటాడు?

ఈవిధంగా అత్యంత విలువైన, ప్రీతికరమైన, ఆనందదాయకమైన సంభాషణలు చేసుకుంటూ ఆ మరణించిన వ్యక్తి తాలూకు బంధువులు, స్నేహితులు స్మశానం నుండి తిరిగి 'జనారణ్యం' వైపుగా సాగిపోయారు.

***

"ఏంటిది?"

మంత్రిగారు సీరియస్ గా అడిగేసరికి పీఎ భయంగా నటించాడు. నిజంగా భయపడటం మానేసి చాలాకాలం అయ్యింది. ఎందుకంటే ఆయన తాలూకు బొక్కలు, స్కాములు, బినామీలు అన్నీ పీఎకి స్పష్టంగా తెలుసు. పైపైన బెదిరించటమే కానీ పీఎని ఏమీ చేయలేనని మంత్రిగారికి కూడా తెలుసు. అందుకే గొంతును మరింత గంభీరంగా మార్చుకుని అడిగాడు.

"ముందు అనుకున్నట్లు వాళ్ళు ఇవ్వాల్సింది ఎనభైకోట్లు కదా ఇప్పుడేంటి అరవైతో సరిపెట్టేస్తున్నారు?"

పీఎ ఈసారి వినయంగా నటించాడు. "దానికే ఏడుస్తున్నారు సార్... కాంట్రాక్ట్ లో పెద్దగా మిగిలేదేం లేదంటున్నారు. అనుకున్నదానికంటే ఎక్కువే ఖర్చయిందంట... నాలుగొందల అడుగులు అనుకుంటే ఎనిమిది వందల అడుగులు దాకా డ్రిల్ చేయాల్సి వచ్చిందంట... ఇంజనీరింగ్, మెయింటెనెన్స్ ఖర్చులు పెరిగిపోయాయని ఒకటే గొడవ..."

"ఇదంతా చెప్పటానికి నువ్వెంత నొక్కావురా?" మంత్రిగారు పైకి అన్లేదు మనసులో అనుకున్నారు. ఆయనకీ తెలుసు తెగేదాకా లాగితే ఆ కాంట్రాక్టర్ తన మొగుడి దగ్గరకే పోతాడు అప్పుడు అసలైన లెక్కలన్నీ బైటకొస్తాయి.

నీటిలో వుండే ఫ్లోరోసిస్ తదితర విష పదార్థాల కారణంగా మనుష్యులు, జంతువులు, ఇతర ప్రాణులు దారుణంగా బలైపోతున్నారన్న దయతో ఏదో విదేశీ ప్రభుత్వం మన స్వదేశీ ప్రభుత్వానికి వెయ్యి కోట్ల రూపాయల గ్రాంట్ ఇచ్చింది. ఆ డబ్బుతో నీటిని శుద్ధి చేసి స్వచ్ఛమైన నీటిని జనానికి అందించాలి. వెయ్యి కోట్లు ఇంకా రాకముందే అంచనాలు, కమీషన్లు, లెక్కలు పూర్తయిపోయాయి. ఇప్పుడు వాటాలు తేల్చుకుంటున్నారన్నమాట.

"సరే ఫైనల్ గా ఇంకో ఐదు పంపమని వాడికి చెప్పు... త్వరలో ఎలక్షన్లు వస్తున్నాయి... ఈసారి ఎంత మేత పెట్టాలో మళ్ళీ రూలింగ్ లోకి రాకపోతే జీవితాంతం కోర్టులు, ఎంక్వయిరీ కమీషన్ల చుట్టూ తిరగాలి..."

"చేసుకున్నవాడికి చేసుకున్నంత..." పీఎ కూడా పైకి అన్లేదు మనస్సులో అనుకుంటూ వినయంగా తలాడించాడు.

***

"అన్నా... కొంచెం భయంగా వుందన్నా... పోలీసులు పట్టుకుంటారంటావా?"

లారీ నడుపుతున్న డ్రైవర్ నోరంతా తెరిచి పెద్దగా నవ్వాడు. ఆల్కహాల్ వాసన గుప్పుమంటూ కొట్టింది. "ఎందుకురా భయం నీకు? ఇప్పటికో వంద ట్రిప్పులేసుంటాను... ఏమౌతుంది? ఏమీకాదు కంగారుపడకు... పోలీసులు ఆపితే ఎలా మేనేజ్ చేయాలో నాకు తెలుసు... నువ్వు గమ్మున కూర్చో..." అంటూ టేప్ రికార్డర్ ఆన్ చేసాడు. టేప్ లోంచి "రింగా రింగా... నా బొంగులో నీ టింగురో..." లాంటి అచ్చమైన సంసారపక్షం పాట వింటూ ఆనందంగా లారీ నడపసాగాడు.

"కానీ పాపం కదన్నా…" అన్నాడు ఇంకా పద్దెనిమిదేళ్ళు దాటని క్లీనర్ కుర్రాడు.

"ఏహే… ఏంట్రా పాపం?" డ్రైవర్ విసుగ్గా అన్నాడు.

"పాపం ఆవుల్ని 'కబేళా' కు తోలేయటం పాపం కదా అన్నా…! పిండుకున్నంత కాలం పాలు పిండుకుని, అది పెట్టిన పిల్లల్ని అమ్ముకుని ఇప్పుడు ఇలాగ కబేళాకు తోలేయటం అంటే…" క్లీనర్ గొంతులో కొంచెం బాధ ధ్వనించింది. ఇంకా ఈ సమాజం తాలూకు విష ప్రభావం పూర్తిగా సోకలేదు కాబట్టి సహజంగా నిజమైన మనిషిలో వుండే మానవత్వంతో ఆలోచిస్తున్నాడు.

"నీకెందుకురా పెద్ద పెద్ద మాటలు… లోడు ఆడదింపి కిరాయి తీసుకుని పోవటమే… వాళ్ళు వాటిని చంపుకుంటారో, లేదా వండుకుని తింటారో నీకూ నాకెందుకురా… తింటానికి గడ్డి లేదు, త్రాగటానికి నీళ్ళూ లేవు… రోజూ చావటం కంటే ఒక్కసారే చావటం నయం కదా!" మనిషి తాను చేసే దుర్మార్గం, ఘోరం, హీనమైన చర్యలను సమర్ధించుకునే వాదనలు ఎప్పుడూ సిద్ధం చేసుకుంటాడు కాబట్టి ఆవులను 'కబేళా' కు తరలించే లారీ డ్రైవర్ తన లాజిక్ తాను ప్రదర్శించాడు.

నాలుగు రోజుల క్రితమే క్లీనర్ గా చేరి ఇంకా గుండెల్లో మానవత్వపు 'తడి' ఆరని పదహారేళ్ళ కుర్రాడు ఏమీ మాట్లాడలేదు.

'గోవధను నిషేధించాలి… ఆవు మన మాతృమూర్తి…" అని రోడ్డు పక్కన పెట్టిన ఫ్లెక్సీ మీదుగా ఆవులను 'కబేళా'కు తరలిస్తున్న ఆ లారీ దూసుకుపోయింది 'రింగా రింగా' పాటను వినిపిస్తూ…

***

"పోయినసారి ఆళ్ళు ఓటుకు ఐదొందలిచ్చారు… ఈసారి కనీసం వెయ్యిలేనిదే కుదర్దు…"

బడ్డీ కొట్టు దగ్గరకెళితే అర్ధ రూపాయి బీడీ కూడా అప్పు పుట్టని వాడు అంత ఖరాఖండిగా ముఖం మీద చెప్పేసరికి ఆ పెద్దాయనకు చప్పున కోపం ముంచుకొచ్చింది. కానీ 'రాజకీయం' కోపాన్ని ఆర్పింది. ఎలక్షన్ల టైం లో మానాభిమానాలకు స్థానం లేదు ఆ ఎలక్షన్లు కాస్తా గట్టెక్కితే మళ్ళీ ఐదేళ్ళదాకా వీళ్ళతో పనేముంది?

"సర్లే ఈసారి ఏడొందలు తీసుకోండి..."

"కుదర్దు... మా ఇంట్లో ఆరోట్లున్నాయి... మొత్తం ఆరేలు... వద్దంటే చెప్పండి... వేరేవాడు నాల్రోజుల్నుండీ ఇంటిచుట్టూ తిరుగుతున్నాడు... మళ్ళీ మందూ, బిర్యానీ కూడా ఫ్రీ అంట..."

వెంకటేశ్వరస్వామి పటం మీద ప్రమాణం చేయించుకున్నాక మూడువేలు అడ్వాన్స్ ముట్టిన దేశ సగటు ఓటరు ముఖం వికసించింది.

ఎన్నికలు జరిగే నాలుగురోజులూ పండగే ఆ తర్వాత రోజుల సంగతి ఇప్పుడెందుకు?

"కానీండ్రా... కానీయండి... బియ్యానికి ఇరవై, కందిపప్పు ముప్పై, వంటనూనె నలభై, పెట్రోలు యాభై పెంచితే అందరికీ దూల వదులుద్ది..." పైకి అనలేదు మనస్సులో అనుకుంటూ ముఖం మీద చిరునవ్వు అతికించుకుని 'ఓట్ల షాపింగ్' కు బయలుదేరాడా పెద్దాయన.

***

"పాతికవేలు ఖర్చవుతుంది..."

"పావుగంట పనికి పాతికవేలా?"

డాక్టరు గారు ఇరిటేటింగ్ గా చూసారు. "పని పావుగంటే... దొరికితే పదేళ్ళు జైల్లో వుండాలి... హాస్పిటల్ క్లోజ్ అవుతుంది..."

"పదిహేను వేలు తీసుకోండి సార్..."

"ఆడపిల్ల పెద్దయితే ఎంత ఖర్చో ఆలోచించు... పోనీ రెండేళ్ళు పెంచి అమ్మేయ్... పిల్లల్ని కొనుక్కునేవాళ్ళూ వున్నారు... డీల్ నేనే కుదురుస్తాను... ఇరవై పర్సెంట్ కమీషన్ ఇవ్వాలి..."

అతను గబగబా లెక్కలేసుకున్నాడు. మొత్తానికి ఇరవై వేలకు డీల్ కుదిరింది... ఎల్లుండే ముహూర్తం. అమ్మ కడుపులో నిశ్చింతగా బజ్జున్న బుజ్జి తల్లికి తన ప్రాణానికి రేటు కట్టేసిన విషయం తెలీదు.

***

"ఐ లవ్యూ..."

"ఇప్పటికి ఎంతమందికి చెప్పావ్?"

"ప్రామిస్... ఇదే ఫస్ట్ టైం..."

ఆ అమ్మాయి తమాషాగా హీరోయిన్ ను అనుకరిస్తూ నవ్వింది... "నీలిమకి ఐ లవ్యూ చెప్పిన సంగతి నాకు తెలీదనుకున్నావా?"

కుర్రవాడి ముఖంలో రంగులు మారాయి కానీ వెంటనే కవర్ చేసుకున్నాడు... "లైట్ తీస్కో అదో టైంపాస్ లవ్ అంతే..."

"మరి నాది?"

"సిన్సియర్ లవ్ మై డార్లింగ్..." శరీరంలో వుండే టెస్టోస్టిరాన్ ప్రభావంతో చెప్పాడా కుర్రాడు. అది వాస్తవం కాదని, ఆ అమ్మాయికీ తెలుసు కానీ ఆ అమ్మాయి లెక్కలు, కొలతలు, కాలుక్యులేషన్స్ ఆ అమ్మాయికి వున్నాయి.

"రాత్రిళ్ళు నీ ఫోన్ ఎంగేజ్ వస్తే నేను ఊరుకోను..."

"రాదు... ప్రామిస్..."

"నా ఫోన్ ఎంగేజ్ వచ్చినప్పుడు నువ్వు అడ్డమైన ప్రశ్నలు అడక్కూడదు..."

"అస్సలు అడగను... నీమీద నాకు పూర్తి కాన్ఫిడెన్స్ వుంది..."

"మన లవ్ వర్కవుట్ అయ్యేదాకా ఫుల్ కాన్ఫిడెన్షియల్ గా వుంచాలి... మీ తొట్టి గ్యాంగ్ దగ్గర పబ్లిసిటీ చేయకూడదు..." తన కండిషన్ల లిస్ట్ చదవడం మొదలుపెట్టింది. ఆ అబ్బాయి అన్నింటికీ తలూపుతూనే వున్నాడు. అసలు వింటున్నాడా? అన్నది డౌటే కానీ ఇద్దరు మోడ్రన్ ప్రేమికుల ప్రేమకు సంబంధించి ఎవరి లెక్కలు వాళ్ళకున్నాయి.

"కాలేజి బ్యూటీని పటాయించిన 'క్రెడిట్ కావాలంటే కాస్త ఖర్చవుతుంది. షాపింగులు, మొబైల్ రీ చార్జ్ లు, ఖరీదైన గిఫ్ట్ లు ఇవన్నీ ఆధునిక ప్రేమలో విడదీయలేని ముఖ్యాంశాలు.

కాలేజ్ బంక్ కొట్టి మార్నింగ్ షో కార్నర్ సీట్లో కూర్చున్న దేశ యువతరానికి సంబంధించిన ఆ అమ్మాయి, అబ్బాయిల మధ్య 'ప్రేమ ఎగ్రిమెంట్' సిన్మా థియేటర్ లో ప్రారంభం అవటంతో రొమాన్స్ లో పడిపోయారు.

హాండ్ బ్యాగ్ లో సైలెంట్ మోడ్ లో వున్న ఆ అమ్మాయి ఫోన్ వెలిగీ ఆరుతుంది. ఆ అమ్మాయి పధ్నాలుగో బాయ్ ఫ్రెండ్ ఫోన్ చేస్తున్నాడు.

***

ఆయన తలెత్తి ఆకాశం వంక చూస్తున్నాడు.

ఆయన తండ్రి, తాత కూడా అలాగే చూసేవాళ్ళు. ఆ చూపు వెనుక వుండే దుఃఖం, ఆవేదన చాలామందికి తెలిదు. తెల్సుకునేంత ఓపిక, జ్ఞానం, కూడా లేదు.

ప్రాణాన్ని మొక్కగా నాటి, రక్తాన్ని నీరుగా పోసి పెంచుతున్న పొలం నీళ్ళు లేక ఎండిపోతుంది. ఆకాశంలో మబ్బుల్లేవు. భూమిలో వెయ్యి అడుగులు పోయినా నీరు లేదు. పోనీ నీటిని తోడటానికి మోటార్ కి కరెంట్ లేదు. ప్రపంచానికే అన్నం పెట్టే రైతు ప్రాణం అలా గాల్లో దీపంలా రెపరెపా కొట్టుకుంటుంది.

రైతు పండించిన దానికి గిట్టుబాటు ధర రాదు. బియ్యం, పప్పులూ కొనుక్కునే వాడికి ధరలు అందుబాటులో వుండవు. పండించిన వాడూ, వినియోగించే వాడి మధ్య వుండే 'పిశాచగణం' మాత్రం రక్తం త్రాగి నిరంతరం బలుస్తూనే వుంటాయి.

రెండు రోజుల తర్వాత...

జిల్లా ఎడిషన్ లో మారుమూల పేజీలో రెండులైన్ల వార్త పడింది.

"అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య..."

జనం, సమాజం పెద్దగా పట్టించుకోలేదు. అదేం పెద్ద విషయమేం కాదు కదా! రోజూ ఎక్కడో ఒకచోట రైతు చస్తూనే వుంటాడు? ఎందుకు చస్తున్నాడు? అని విశ్లేషించేంత తీరిక ప్రభుత్వాలకూ, జనాలకూ లేదు. ఎవరి బిజీ వాళ్ళది.

ఇరవై వేల కోట్లు దోచుకున్న రాజకీయ నాయకుడికి బెయిల్ దొరుకుతుందా? లేదా? అన్నది ఇక్కడ ముఖ్యమైన పాయింట్. అది కాకపోతే రేపులు, మర్డర్లు, సిన్మా రంకు పురాణాలు వుండనే వున్నాయి...

"ధూ... దీనెమ్మ సమాజం చెడిపోతుంది..." అనుకునేవాడే ప్రతోడూ. సమాజం అంటే ఏమిటి? నేను తప్ప ఇతరులన్న మాట...

***

"అమ్మ, నాన్నల్ని ఓల్డ్ ఏజ్ హోమ్ లో చేర్పిస్తే మంచిది..."

"ఎందుకు?" అని అతను అడగలేదు. అడిగితే చాలా విషయాలు బైటకొస్తాయి. ఆరు నెలలు ఇక్కడా, ఆరు నెలలు అక్కడ... పల్లెటూళ్ళ ఖర్చు తక్కువ... సిటీల్లో ఖర్చు ఎక్కువ. ఆ లెక్కన తానే ఎక్కువ ఖర్చు పెడుతున్నాడు. ఈ గొడవ అంతటి కంటే చెరో నాలుగువేలు వేసుకుంటే ఇద్దరూ ఓల్డ్ ఏజ్ హోమ్ లో వుంటారు. ఈ లెక్కలు, బాధ్యతలు, ఏడుపులు, విసుక్కోవటాలు, ముఖ్యంగా కొంపలో 'ముసలివాసనా' లేకుండా వుంటుంది.

'మీకు ఇష్టమేనా?' అని ఆ తల్లితండ్రుల్ని ఎవ్వరూ అడగలేదు. సెకండ్ హాండ్ వస్తువులను అమ్మేయటానికి ఎంత తాపీగా నిర్ణయం తీసుకుంటారో అంత తేలిగ్గా ఆ వృద్ధ తల్లితండ్రుల జీవితం గురించి నిర్ణయం తీసుకోబడింది.

అమ్మనాన్నలు 'ఎదిగిపోయిన' తమ బిడ్డల 'మేధస్సు' కు ఆశ్చర్యపోయారు. బాల్యం నుంచి నేర్పిన కెరీరిజం, లౌక్యం, కూసింత స్వార్థం తాలూకు పరిణామక్రమం ఇది. వాళ్ళకు అమ్మ, నాన్నలు గుర్తొచ్చారు. బిడ్డల చదువుల కోసం తల్లితండ్రుల్ని పల్లెటూళ్ళో వదిలేసి సిటీ సుఖాలకు అలవాటుపడ్డ ప్రాణాలు కొంత కాలం గడిచేసరికి తమ 'కెరీరిజం' తాలూకు పెంపకం ఇప్పుడు తమ 'నిజ స్వరూపాలను' ప్రదర్శించటం మొదలుపెట్టాయి. జీవితం అంటే ఇదేనా?

కొడుకులు గొప్పవాళ్ళవ్వాలని మనస్సు చంపుకుని బిడ్డల్ని రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల్లో పెట్టి అప్పులు చేసి తినీ తినక ప్రాణం పెట్టి చదివించిన తల్లి తండ్రుల 'ఋణం' 'ఓల్డ్ ఏజ్ హోమ్' కు చేర్చటం ద్వారా పరిసమాప్తం... ఇదీ మోడ్రన్ 'ఋణ విముక్తి' ప్లానింగ్...

***

సాయంత్రం అవుతుంది.

డెబ్బై ఏళ్ళ వృద్ధుడు అత్యంత ఏకాగ్రతతో, మమకారంతో మొక్కలు నాటుతున్నాడు. రెండు, మూడుసార్లు చూపు ఆనక గునపం

తగిలి వ్రేళ్ళు చిట్టి రక్తం వచ్చింది. దాన్ని పట్టించుకోని ఆ వృద్ధుడు నాటిన మొక్కలన్నింటినీ జాగ్రత్తగా నీళ్ళు పోసాడు.

ఇదంతా గమనిస్తున్న ఆయన మనవడు అడిగాడు "తాతా! ఆ మొక్కలు పెద్దయి కాయలు కాసేనాటికి నువ్వు చచ్చిపోతావు కదా ఎందుకీ శ్రమ?"

ఆయన మనవడి వంక చూసి నవ్వాడు. లాభనష్టాల కాలుక్యులేషన్స్ లేని తరం అది. అందుకే ఇలా అన్నాడాయన.

"నాయనా! నేను చచ్చిపోవచ్చు... నువ్వూ, నీ బిడ్డలూ ఈ చెట్ల కాయలు తింటారు... మా తాత నాటిన చెట్ల కాయలు నేను తిన్నాను. ఈ తల్లి పచ్చగా వుంటేనే కదా అందరం బ్రతికేది... నువ్వూ నాలుగు మొక్కలు నాటు నాయనా..."

మనవడు తలాడించాడు. తాత చెప్పిన 'జీవిత సత్యం' అతనికి అర్ధం అయ్యిందో లేదో మనకు తెలీదు.

***

(లోకమంతా కుళ్ళిపోయిందని కాదు కానీ ఒకప్పుడు మహనీయుల సంఖ్య తక్కువగా వుండేది ఇప్పుడు స్పందించే మనుష్యుల సంఖ్య తగ్గిపోతుంది. ఇది గ్లోబల్ వార్మింగ్ కంటే అత్యంత ప్రమాదకరం.)

***